# నీలోకి నువ్వు

(ఆధ్యాత్మిక గుళికలు)



కేతవరపు రాజ్యశ్రీ

# శ్రీరమణభగవాన్

అరుణగిరివాసా!
హే భగవాన్ రమణా!

గోచీపెట్టిన
కోటీశ్వరుడవు నీవు
కిరీటం లేని
సార్వభౌముడవు నీవు
ఉపనిషత్తుల సారానికి
ఆకారం నీవు
ఆధ్యాత్మిక ఆకలికి
సాకారం నీవు

మూర్తీభవించిన పరబ్రహ్మం
నీ దివ్య మంగళ రూపం
సమస్యలన్నింటికీ సమాధానం
నీ మౌన వీక్షణం
పున్నమి వెన్నెల జల్లు
నీ ప్రశాంత మందహాసం
పంచభక్ష్య పరమాన్నం
నీ ఆశ్రమ ప్రసాదం

మా తప్పటడుగులను
సరిచేసేవు
అరమరికలు లేని
అవ్యాజ ప్రేమను కురిపించేవు
కకావికలైన మనసుపై
కరుణామృతము కురిపించేవు
మా చింతలుబాపి
చల్లని స్వాంతన కలిగించేవు

చెట్టునైనా కాకపోతిని
చల్లని నీడ నిను సేద తీర్చగ
నెమలినైనా కాకపోతిని
నినుగని పరవశించి నాట్యమాడగ
ఉడుతనైనా కాకపోతిని
నీ చేతి గింజలు ఆరగించగ
భూరేణువైనా కాకపోతిని
నీ పాదస్పర్శకు పులకించగ

నిశ్చల ధ్యాన శక్తి
నిరంతర శోధనా శక్తి
నిర్వికార ఆరాధనాశక్తి
అనిర్వచనీయ ఆత్మానంద శక్తి
నాకు ప్రసాదించు భగవాన్
నీ పాదాల చెంత
ఆత్మార్పణకావించే
భాగ్యాన్ని కలిగించు మహర్షీ

# నీలోకి నువ్వు

(ఆధ్యాత్మిక గుళికలు)

కేతవరపు రాజ్యశ్రీ

ప్రచురణ - 2011

**నీలోకి నువ్వు**

**కె. రాజ్యశ్రీ**

ప్రథమ ముద్రణ: ఏప్రిల్, 2011

కాపీలు : 500

హక్కులు రచయిత్రివి

వెల : రూ.60/-

గ్రంథాలయ ప్రతి : రూ.80/-

ప్రతులకు:

**శ్రీమతి రాజ్యశ్రీ**

ఫ్లాట్ నెం.301, గోకుల్ అపార్ట్‌మెంట్స్

స్ట్రీట్ నెం.4, అశోక్ నగర్, హైదరాబాదు - 500 020.

ఫోన్ : 2767 0267

*డి.టి.పి. :*

**కె. బాలకృష్ణ, హైదరాబాదు.**

సెల్ : 95506 81039

*ముద్రణ :*


**విప్ల కంప్యూటర్ సర్వీసెస్**

*(డిజైనర్స్ & మల్టీ కలర్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్)*

నల్లకుంట, హైదరాబాద్-500 044.

ఫోన్: 27677078, 27676910

# అంకితం



నా ఆధ్యాత్మిక గురువు,

దైవజ్ఞ శిరోమణి బిరుదాంకితులు

శ్రీలలితా సహస్రనామ భాష్యకారులు

మా నాన్నగారు

**కీ.శే. మహాకాళి వేంకటరావుగారికి**

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | నివేదన | 1 |
| 2. | ప్రతి క్షణం జీవించు | 3 |
| 3. | జీవిత సాఫల్యం | 6 |
| 4. | గృహస్థాశ్రమమొక గొప్ప యోగం | 9 |
| 5. | దానం భగవంతుడిని చేరే మార్గం | 11 |
| 6. | భగవంతుని దయ | 13 |
| 7. | పతనానికి తొలిమెట్టు అహం | 15 |
| 8. | అశాంతికి మూలం | 17 |
| 9. | ప్రపంచమంతా గురుమయం | 20 |
| 10. | భగవంతునిపై విశ్వాసము | 22 |
| 11. | నిత్య సంతోషం | 25 |
| 12. | న్యాయబద్ధ సంపాదన | 27 |
| 13. | సారూప్య భక్తి | 31 |
| 14. | మానసిక పూజ | 33 |
| 15. | సుఖశాంతులు | 37 |
| 16. | మౌనం మాటకంటే పదును | 39 |
| 17. | సత్వర బ్రహ్మజ్ఞానం | 41 |
| 18. | అంతం-నిర్భయం | 43 |



# జీవనయానంలో పనికొచ్చే వ్యాసాలు ఈ ఆధ్యాత్మిక గుళికలు

"నీలోకి నువ్వు" పేరిట ఈ ఆధ్యాత్మిక గుళికలను కేతవరపు రాజ్యశ్రీ ఈసారి మనకు అందించారు. ఇంతవరకూ వారి కవితలకు మాత్రమే పరిమితమయ్యేవారు. సామాన్యంగా ఉద్యోగస్తులు రిటైర్‌మెంట్ తర్వాత ఈ మధ్య కాలంలో, ఒక వ్యాపకంగా ఈ 'ఆధ్యాత్మిక రచనలు' చేయడం సాధారణంగా కనిపిస్తూవుంది. అయితే తెలుగు, సంస్కృత ఉపాధ్యాయులూ, వాస్తు, జ్యోతిష రంగాలవారూ ఈ ఆధ్యాత్మిక రచనలవైపూ, టీవి ఛానల్స్‌లో ప్రసంగాలవైపూ దృష్టి సారించి రాణిస్తున్నారు. కానీ కేతవరపు రాజ్యశ్రీగారు అలా కాదు. స్వతహాగా దైవభక్తి వున్నవారు. మానవీయ విలువలపట్ల గాఢనమ్మకం వున్నవారు. ఎప్పుడూ చిరునవ్వుతో కనిపించే ఈమెకు, అందరూ అలాగే హాయిగా వుండాలనుకునే మనస్తత్వం కలవారు. దాదాపు 20 వివిధ అంశాలమీద రాసిన రాజ్యశ్రీ, 'నివేదన'తో ప్రారంభించిరీ పుస్తకాన్ని, 'నిత్య సంతోషం', 'బ్రహ్మజ్ఞానం', 'నిర్భయ మరణం', 'సారూప్య భక్తి', 'జీవిత సాఫల్యం' వంటి అంశాలలో పరమాత్ముడి మీద సదా నమ్మకంవుంచి, ఆయన సేవలోనూ, ధ్యానంలోనూ జీవితకాలాన్నంతా గడపాలని రాజ్యశ్రీగారు కొన్ని ఉదాహరణలనూ అక్కడక్కడా ఇచ్చుకుంటూవచ్చారు. తుమ్మెద మీదే తన ధ్యాసంతా పెట్టిన పురుగు చివరకు తుమ్మెదలాగా ఎలామారిపోయిందో చక్కగా చెప్పారు. మనిషి ప్రలోభాలకులోను కాకూడదంటుంది ఈమె.

మాటలకంటే మౌనం ఎక్కువ భావ ప్రకటన చేయగలదు. ఎదుటివారి మౌనం మనల్ని శోధించుకునేట్టు చేస్తుందన్నారు. ముని యొక్క ప్రతిష్టకు మౌనమే కారణమని చెబుతూ, వినాయకుడు తాను మౌనంగా వుండటం వలననే మహాభారతం రాయగలిగానని చెప్పినట్లుగా ఎన్నో విషయాలను రాజ్యశ్రీ వివరించారు.

జీవితం ఎంతో విలువైనది. కాలం ఎవ్వరికోసమూ ఆగదు. గడచిన క్షణం మరలా తిరిగిరాదు. ఈ విషయాన్నే రచయిత్రి "ప్రతిక్షణం జీవించు" అంటూ బాగా రాశారు.

పిండి ఒక్కటే, అయితే వండేవాణ్ణి బట్టి ఆ వంటకం రుచివుంటుంది. ఆ విధంగా ఈ పుస్తకంలోని విషయాలు అందరికీ తెలిసినవే అయినా, కేతవరపు రాజ్యశ్రీ అందించిన తీరు బాగుంది.

ధార్మిక జీవనమే ఆధ్యాత్మికత అంటుంది కేతవరపువారు. మన కర్తవ్యాన్ని ధర్మబద్ధంగా ప్రతిఫలాపేక్ష లేకుండా నిర్వహించడమే అసలైన తపస్సు. అసూయ, అహంకారాలను వదలిపెట్టి సాత్విక జీవనం గడపటం ద్వారా ఆత్మజ్ఞానాన్ని పొందగలమంటారు. 'జీవిత సాఫల్యం' అన్న రచనలో, ఎవరి సాంగత్యం వలన, భాషణం వలన, కర్మాచరణం వలన మనకి భక్తి, జ్ఞాన వైరాగ్యాలు కలుగుతాయో, ఆ మహనీయులు దైవ సంపద కలిగినవారిగా గుర్తించి, శుశ్రూషచేసి ముక్తిమార్గం తెల్సుకోవాలన్నారు. భగవంతుని కృపకు పాత్రులు కావడానికి దానము ఒక సోపానముగా ఉపయోగపడుతుందన్నారు మరో వ్యాసంలో.


రాజ్యశ్రీగారు షిర్డిసాయి బోధనలనూ, పురాణ గ్రంథాల్లోని పిట్ట కథలనూ, దత్తాత్రేయ చరిత్రనూ, రమణ మహర్షి వంటి మహాత్ముల చరిత్రలోని సంఘటనలనూ ఆధారం చేసుకుని రచనలు సాగించారు. మంచి మాటలను మనం ఎన్ని సార్లువిన్నా, ఎన్ని సార్లు చదివినా, ఎన్ని సార్లు రాసినా అంతంవుండదు. ఎప్పటికప్పుడు అందులో ఏదో కొత్తదనం కన్పడుతూనే వుంటుంది. ఇది, అది రాసిన రచయిత మీద ఆధారపడి వుంటుందన్నది నిజం. ఆవిధంగా రాజ్యశ్రీగారు మంచి విషయాలను క్రోడీకరించి, తమదైన శైలిలో మంచిగా రాశారు. ఈ విషయంలో ఆమె కృతకృత్యులయ్యారు.

పతనానికి తొలిమెట్టు 'అహం' అన్నవ్యాసంలో చంచలమైన మనస్సును అరికట్టి, సద్గ్రంథ పఠనం, నిత్య సత్సంగం, ఆత్మవిచారం అలవర్చుకొని,

అహంకారమమకారాలను త్యజించి, 'అహంబ్రహ్మాస్మి' అనే స్థితికి చేరుకోవాలంటారు రాజ్యశ్రీ. ఈవిధంగా ఆధ్మాత్మిక గుళికలు అంటూ అందించిన ఈ పుస్తకంలో 'నీలోకి నువ్వు' చూసుకోమంటూ రాజ్యశ్రీగారు మనందరికీ ఒక విధంగా గొప్పమేలు చేశారనుకోవాలి. ముందు ముందు రాజ్యశ్రీగారి కలంనుండి మరిన్ని మంచి మాటలు గ్రంథాల రూపంలో రావాలని కోరుకుందాం!

ఆధ్యాత్మికవేత్త, సాహితీమిత్ర
**పులివర్తి కృష్ణమూర్తి**
పాత్రికేయులు, కవి, ప్రవాచకులు,
సాహితీ సమీక్షకులు.

# మానసిక రుగ్మతలను తొలగించే ఔషధం ఈ "ఆధ్యాత్మిక గుళికలు"



అనాదిగా మానవుడు ప్రకృతిపై ఆధారపడి జీవిస్తున్నాడు. అందుకేనేమో! ఈ సృష్టి ఆరంభమైనప్పటినుండి తమకు ఆధారమైన ప్రకృతిని ఆరాధించటం మానవుని నైజంగా మారింది. నిజంగా ఆలోచిస్తే 'దేవుడు' అనేవాడు ప్రకృతికి సంబంధించినవాడే అని చెప్పవచ్చును. అందుకే పర్వతరాజు (ఒక మహాపర్వతం) కుమార్తెను పార్వతీదేవిగానూ, శివుడిని ఆదిమానవుడిగానూ చెప్పుకుంటుంటారు. అలాగే లక్ష్మీదేవిని సముద్రుని పుత్రికగా భావిస్తుంటారు. ఈ విధంగా దేవతలకూ, ప్రకృతికీ అవినాభావ సంబంధం వున్నది. మానవుడు తనకు కావలసిన వనరులను సమకూర్చే ప్రకృతిని ఆరాధించటంలో తప్పులేదు.

రచయిత్రి కేతవరపు రాజ్యశ్రీ 'నీలోకి నువ్వు' ఆధ్యాత్మిక గుళికలు పుస్తకంలో 'భూమి' సహనానికి మారుపేరు కాబట్టి ప్రథమ గురువనీ, సుగంధాలు, మలినాలపై నుండి సమంగా వీచే 'వాయువు' రెండవ గురువనీ, సూర్య చంద్రులనూ, నక్షత్రాలనూ ఇముడ్చుకొన్న 'ఆకాశం' మూడవ గురువనీ, నీరు నాల్గవ గురువనీ, అగ్ని ఐదవ గురువనీ ప్రకృతిలో ఉన్న పంచభూతాలనే మనం గురువులుగా భావించాలని ప్రభోధిస్తారు.


గృహస్థాశ్రమమొక గొప్ప యోగమనీ, ఆధ్మాత్మిక అభివృద్ధి సాధించటానికి అరణ్యాలకు వెళ్ళి తపస్సు చేసుకోవలసిన అవసరం లేదనీ అదేదో సంసార భారం మోస్తూనే ధర్మపథంగా జీవించాలని అంటారు. అందుకు ఒక ఋషిపుంగవుని కథను ఉదహరిస్తారు. నిజమే మరి పూర్వకాలం నుండీ సంసారాన్నీ, తనచుట్టూవున్న సమాజాన్నీ వదలకుండా మరి కష్టసుఖాలను తెలుసుకుంటూ భగవంతుని ధ్యానంతో పాటు ప్రజల సమస్యలను అన్నమయ్య, త్యాగయ్య వంటి వాగ్గేయకారులు తమ గానం ద్వారా సంఘంలో మార్పుతేవటానికి కృషి చేశారు.

మౌనవ్రతం గురించి చెపుతూ సౌజ్ఞలద్వారా అభివ్యక్తీకరిస్తూ ఎదుటి వారికి అర్థంకాకపోతే తలకొట్టుకుంటూ రాసి చూపిస్తూ పాటించే మౌనం సత్ఫలితాలనివ్వదనీ, మనసులోని ఆలోచనలకు అడ్డుకట్టవేసి నిర్వికారంగా, నిర్విచారంగా, ప్రశాంతంగా శూన్యమైన ధ్యానావస్థే 'మౌనం' అన్న రచయిత్రి వాక్యాలు ఈ రోజుల్లో పైకి మౌనవ్రతాన్ని పట్టి మనసంతా బాహ్యవిషయాలపై కేంద్రీకరించే వారికి ఒక గుణపాఠం చెప్పినట్లని పించింది.

ఆధ్యాత్మికతత్వం పాటించటం అంటే అదేదో గొప్ప విషయమంటూ సమాజంలో తమకు ఒక ప్రత్యేక స్థానమున్నదని గర్వపడుతూ అన్నీ తమకే తెలుసునని అనుకుంటూ వాస్తవాలకి దూరంగావుండే మానసిక రుగ్మతలతోవున్నవాళ్ళకు ఈ ఆధ్యాత్మిక గుళికలు ఔషధంలా పనిచేస్తాయి అనటంలో అతిశయోక్తిలేదు. దురాచారాలను వదలి సదాచారాలని పాటించాలని తెలియజేసే వ్యాసాలు, ఆ వ్యాసాలలో విషయాలకు ఉదాహరణలు కొన్ని చిన్న చిన్న కథలనూ అందరికీ అర్థమయ్యే రీతిలో రచించిన కేతవరపు రాజ్యశ్రీకి ఈ వ్యాసాలు సాహితీ కిరణంలో ప్రచురించబడి పాఠకుల ఆదరణ పొందినందుకు శుభాభినందనల నందిస్తున్నాను.

**పొత్తూరి సుబ్బారావు**
సంపాదకులు
సాహితీ కిరణం

# ఆధ్యాత్మిక ప్రయోజనం




శ్రీమతి కేతవరపు రాజ్యశ్రీ నాకు కవయిత్రిగానే తెలుసు. ఆమె రచించిన 'గుండె చప్పుళ్ళు', 'ఊహల వసంతం', 'సిసింద్రీలు' కవితా సంపుటిలను మా సంస్థ ద్వారా ఆవిష్కరించాం. సచివాలయంలో ఉన్నతోద్యోగం చేస్తూనే రచనలు చేస్తూ చేతన సచివాలయ సారస్వత వేదికను అందరూ మెచ్చేలా నిర్వహించటం కొనియాడదగినది.

గత సంవత్సరకాలంగా రాజ్యశ్రీ ఆధ్మాత్మిక రచనలు శ్రీ పొత్తూరి సుబ్బారావు సంపాదకులుగా వెలువడుతున్న 'సాహితీ కిరణం' మాస పత్రికలో ప్రచురితమై పాఠకుల ప్రసంశలందుకుంటున్నాయి. కర్తవ్య నిర్వాహణ, పవిత్రత, ప్రణాళికాబద్ధం, అంగం, మౌనం, చింతన, నివేదన, దానం, మనోబలం, నిష్కల్మషం, జీవనసాఫల్యం, సాత్విక జీవనం, ప్రశాంతత యితరాది అంశాలు ఎన్నుకొని ఆధ్మాత్మిక గుళికలను మనకందిస్తున్న రాజ్యశ్రీ అభినందీయురాలు. ఆధ్మాత్మిక ప్రయోజనాన్ని ఇంత స్పష్టంగా చెప్పే రచయిత్రి రచనాశైలి, భావనాశక్తి అత్యున్నతం- అద్భుతం.

త్వరలో పదవీ విరమణ చేయబోతున్న రచయిత్రి మరిన్ని రచనలను పాఠకుల ముందుకు తేవాలని గొప్ప వ్యక్తిత్వం కల్గిన రాజ్యశ్రీని కోరుతూ అభినందిస్తూ-ఆశీర్వదిస్తున్నాను.

**గుదిబండి వెంకట రెడ్డి**
చైర్మన్
జి.వి.ఆర్. ఆరాధన కల్చరల్ ఫౌండేషన్

**24.03.2011**



# పూర్ణదృష్టి

కేతవరపు రాజ్యశ్రీ 'ఆధ్యాత్మిక గుళికలు' మనిషి మానసిక రోగాలకు మందుల్లా ప్రవచించారు. 'ఆధ్యాత్మికత' అనుసరణ అంత సులువుకాదు. దీక్ష, పట్టుదల, దైవచింతన, పరమాత్మశరణం, ఈలక్షణాలు అలవడినపుడే జీవుడు భౌతికంగా సుఖంగా ఉండవచ్చు. ఈ గ్రంథంలో దానం ద్వారా భగవంతునిచేరవచ్చనీ, గృహస్థాశ్రమం గొప్ప యోగంఅనీ, ప్రపంచమంతా గురుమయంఅనీ, మాటకంటే మౌనం పదునుఅనీ, అహం తొలుగుతే మనిషి ఉన్నతుడౌతాడనీ, నిర్భయ మరణం, నిత్యసంతోషం మనిషి జీవితానికి ఆధ్యాత్మిక సోపానాలనీ రాజ్యశ్రీ వక్కాణించారు.

మానవులలో చాలా మంది భౌతికవాదులు. ప్రాపంచిక సుఖాల వలయంలో సర్వం మరచి పోతారు. తమను సృష్టించిన భగవంతుడినే మరచి పోతారు. అలాంటివారి జీవితం గానుగ ఎద్దు నడకలాగే వుంటుంది. హృదయంలో మెరుపులు మెరవాలంటే ఆధ్యాత్మిక వాతావరణం సృష్టించుకుని జీవించాలి. భౌతిక వాంఛలు వ్యయయానుకూలంగా కోరితే అవసరమే కానీ జీవితంలో అవి ముఖ్యంకాదు. నిర్భయ మరణం నిత్యసంతోషం ప్రతీ మనిషిలో తొణికిసలాడాలి. వీటి నుంచే క్రొత్త జీవితానికి పునాది. కాని ఆత్మనశించదు. ప్రపంచంలో ప్రతీ వ్యక్తి గురువులాంటివాడే. ప్రతీ మనిషి జీవితం నుంచి ఎన్నో నేర్చుకోవచ్చు. అసలు ఆధ్యాత్మికత అంటే ఏమిటి? భౌతిక జీవితాన్ని అవసరంబట్టి నడిపిస్తూ, అంటిముట్టకుండా నిత్య భగవన్నామ స్మరణతో తనవ్యక్తిత్వం, ఆత్మతత్వం తెలుసుకుని పురోగమించడం శ్వాసలు, ప్రాణాయామం, శ్వాసల్లోనే పరమాత్మ సాన్నిధ్యం వస్తుంది. శ్వాసలు యోగం,

ధ్యానంలోకి వెడితే శ్వాసద్వారా యోగనిద్ర సాధ్యం. అప్పుడే జీవితం పరమాత్మ సాన్నిధ్యం పొందగలరు.

రాజ్యశ్రీ మంచి రచయిత్రి, సృజనాత్మక రచనలు, ఎన్ని వ్రాసినా, దృష్టి ఆధ్యాత్మికతవైపు కూడా ప్రసరించడం ఆవిడ అదృష్టం. మనిషి చివరి దశలో ఆధ్యాత్మికత చాలు అని కొందరంటారు. అలాకాకుండా జీవితంలో ప్రతీక్షణం పరమాత్మను ధ్యానిస్తూ తన జీవితగమనానికి మూల చైతన్యం భగవంతుడే అని స్థిరమైన నమ్మకం కల్గినవారే, భక్తి ద్వారా దైవసాన్నిధ్యం పొంది తరిస్తారు.

ఎన్ని రచనలు చేసినా అవి కీర్తినివ్వలేవు. అలోచనా పటిమ ద్వారా ఆధ్యాత్మిక పరిమళం ప్రసరిస్తే ఆ జీవి ధన్యుడు. చరిత్రల్లో నిలుస్తాడు. ధనము సంపాదన అవసరమైనా, మనము నిమిత్త జీవిత గమ్యం అయితే మనిషి జీవితం ధన్యం. ఇటువంటి మంచి రచనలు చేసిన రాజ్యశ్రీకి నా శుభాభినందనలు.

కవి కృష్ణానంద, కళాప్రపూర్ణ, సరస్వతీ సమ్మాన గ్రహీత

07.03.2011 **డా॥ పోతుకూచి సాంబశివరావు**

# స్వగతం

పువ్వు వికసిస్తే గాలంతా పరిమళం. సజ్జనుల సహవాసం చూపించు పరమార్థం. ఎందరో సజ్జనులు అందరికీ వందనాలు. ఈ ఆధ్యాత్మిక రచనలు రాయడం సజ్జన సాంగత్య ఫలితమే.

"చారిటీ బిగిన్స్ ఎట్ హోమ్" అన్నారు. అలాగే ఈ ఆధ్యాత్మికత నాకు మా తల్లిదండ్రుల నుండి సంక్రమించినది. నా చిన్నప్పుడు, మా అమ్మ తనతోపాటు సత్యనారాయణ స్వామి గుడిలో చెప్పే ఆధ్యాత్మిక ప్రవచనాలకి తీసుకువెళ్లేది. అక్కడ ఆ ప్రవచనంలో "ఈ జగత్తంతామిథ్య" ఈ జీవితం ఒక సినిమా రీలులాంటిది. సినిమా చూస్తున్నంతసేపూ దానిలో తాదాత్మ్యం చెంది, వాళ్ల కష్ట సుఖాలు మనం కూడా అనుభవిస్తాము. బయటకు రాగానే అది సినిమా అని గుర్తుకొస్తుంది. అలాగే ఈ జీవితమనే నాటకంలో పాత్రధారులం మనమందరం, మన పాత్ర అయిపోగానే, ఈ దేహం వదిలి ఆత్మ పరమాత్మలో చేరుతుంది. అంటూ ఉపన్యాసం సాగిపోయేది. అప్పుడు నాకేమీ అర్థం కాలేదు. అయితే సినిమా రీలులాంటిది జీవితం అన్నమాటలు మాత్రం మనసులో ముద్రించుకుపోయాయి.

మా నాయనమ్మ శ్రీమతి సుబ్బమ్మగారు. ఆవిడ జబ్బుపడి పక్షవాతంతో మంచాన పడ్డారు. ఏవైనా దేవుడి పుస్తకాలు చదివి వినిపించమని సౌంజ్ఞల ద్వారా అడిగేది. మా నాన్నగారు (కీ.శే.మహాకాళి వేంకటరావుగారు) ఆవిడకి భగవద్గీత చదివి వినిపించమని నాకు ఆర్డరు వేశారు. హాయిగా ఆడుకోవడానికి వెళ్లనీయకుండా ఈ భగవద్గీత చదివి వినిపించట మేమిటిరా బాబూ నేనేమన్నా 90 ఏళ్ళ దానినా అనుకుంటూ, నాన్నమాట జవదాట లేక ఆవిడకి చదివి వినిపిస్తుంటే, రకరకాల ప్రశ్నలు వేసేది. "ఈ శరీరం ఆశాశ్వతం. ఆత్మ నిత్యము దానికి ఏవిధమైన బాధలూ వుండవు. కాబట్టి నశించే శరీరం గురించికాక, నాశనములేని ఆత్మతత్వం గురించి తెలుసు కోవాలి" ఇంకా ఇలాగే కొంత చదివి వినిపించాను. కృష్ణుడు, రాముడు గురించి వింటే మోక్షం వస్తుందనుకునే నాయనమ్మకి ఈ తత్వం కొంత గందరగోళంగా వుండి, ఆదేమిటే! శరీరానికి దెబ్బతగిలితే బాధగా వుండదూ!

బాధ లేదనకుంటే పోతుందా? మందోమాకో వేయకపోతే తగ్గదు కదా! శరీరం మనది కాదనుకుంటే బాధ పోదుకదా! అంటూ ప్రశ్నించేది. "ఏమో! నాకుమటుకు ఏం తెలుసు? నాన్నగారు చదవమన్నారు చదివాను. అంతేకానీ నీ ప్రశ్నలతో నన్ను విసిగించకు" అనేదాన్ని.

అలా భగవద్గీతే కాకుండా ఆవిడ జబ్బు తగ్గడానికి కొన్ని దేవుడి శ్లోకాలు చదివి, ఆవిడ చేత మననం చేయించడం వలన పెద్దయ్యాక, వాటి తాలూకు వాసన నాలో నిక్షిప్తమయి కొన్ని సద్గ్రంథాలు, భగవద్గీత శ్లోకాలు, శ్రీదత్త ప్రభువు చరిత్ర, భగవాన్ రమణ మహర్షి చరిత్ర ఇలాంటివే మరి కొన్ని చదవటం జరిగింది. తరువాతి రోజుల్లో వేసవి సెలవుల్లో చుట్టు పక్కల పిల్లలందరిని జమచేసి, వారితోపాటు మా పిల్లలకి కూడా భగవద్గీత 12, 16 ఆధ్యాయాలు కంఠోపాఠం చేయించాను. దానిలో కాంపిటీషన్ పెట్టి బహుమతులు ఇవ్వడంలాంటి కార్యక్రమాలు చేపట్టేదాన్ని. అలా మొదలైన ఆధ్యాత్మిక పరిజ్ఞానం, నాకు తెలిసినంతలో నలుగురితో పంచుకోవాలని "సాహితీ కిరణం" మాస పత్రికలో "ఆధ్యాత్మికం" అనే శీర్షక ద్వారా బహిర్గతం చేయడం జరిగింది.

అలా "సాహితీ కిరణం" మాస పత్రిక ఆవిర్భావంనుంచి వెలువడిన వ్యాసాలను సంకలనం కావించి "నీలోకి నువ్వు" అనే పుస్తకాన్ని వెలువరించాను.

ఈ వ్యాసాలు చదివి అనేకమంది పాఠకులు, ఉత్తరాల ద్వారా, ఫోన్ ద్వారా తమ అభినందనలు తెలియచేసారు. వారందరికీ కృతజ్ఞతలు. వారి అభినందనలే స్ఫూర్తిగా తీసుకుని మరిన్ని వ్యాసాలు రాయాలనివుంది. అయితే ఈ పుస్తకంలో 18 వ్యాసాలు మాత్రమే వున్నాయి. ఎందుకంటే ఆధ్మాత్మికత మొదట విత్తనంలాగా వేళ్లూనుకుంటేనే మనసులో బాగా నాటుకుంటుంది. ఇటువంటి వ్యాసాలు చదవాలంటే కొంచం ఓర్పు. ఆ వైపు ఆలోచన, మనసు కూడా అందుకు సిద్ధంగా వుంటేనే చదవ గలుగుతాము. చిన్నపుస్తకమయితే ఒకసారి తిరిగేద్దాం అనుకుంటారు. అందుకే కొన్ని వ్యాసాలు మాత్రమే పొందుపరుస్తున్నాను.

కె. రాజ్యశ్రీ

# కృతజ్ఞతలు

ఆధ్యాత్మిక శిరోమణి పులివర్తి కృష్ణమూర్తిగారు రచనలు చూసిన తరువాత నా ఆలోచనకు బలం చేకూరింది. "జీవనయానంలో పనికొచ్చే వ్యాసాలు ఈ ఆధ్యాత్మిక గుళికలు" అంటూ ముందు మాట ద్వారా వారి ఆశీస్సులు అందచేసిన సాహితీ సమీక్షకులు శ్రీ పులివర్తి కృష్ణమూర్తిగారికి నా ధన్యవాదాలు.

అలాగే సాహితీ మిత్రులు, ఆత్మీయులు 'సాహితీ కిరణం' సంపాదకులు శ్రీ పొత్తూరు సుబ్బారావుగారు తమ అమూల్యమైన సందేశాన్నివ్వటమే కాకుండా, ఆధ్యాత్మిక శీర్షిక కింద ప్రతినెలా "సాహితీ కిరణం'లో ప్రచురించి ప్రోత్సహించనందుకు వారికి, వారి శ్రీమతి పొత్తూరి జయలక్ష్మిగారికి నా కృతజ్ఞతలు.

సరస్వతీ సమ్మాన్ గౌరవనీయ సాహితీదిగ్గజులు శ్రీ పొతుకూచి సాంబశివరావుగారు, మానాన్నగారికి మంచి మిత్రులు. అఖిల భారతీయ భాషా సమ్మేళనంలో సభ్యురాలిగా చేరిన తరువాత వారితో నాకు పరిచయమయింది. అప్పటినుంచీ, కవిసమ్మేళనాలలో తరచూ పాల్గొంటూ వారి అభిమానాన్ని చూరగొనటం జరిగింది. ఈ ఆధ్యాత్మిక రచనలకి వారి ఆశీస్సులు నాకు శిరోధార్యాలు, వారికి నా ధన్యవాదాలు.

జి.వి.ఆర్. ఆరాధన సంస్థ అధ్యక్షులు శ్రీ గుదిబండి వెంకట రెడ్డిగారు మా కుటుంబానికి అత్యంత ఆత్మీయులు. ఈ పుస్తక ఆవిష్కరణకే కాకుండా వారు తెలియచేసిన శుభాకాంక్షలు, నాకు అత్యంత విలువైనవి. వారికి నా కృతజ్ఞతలు.

చివరిగా నాలో ఆధ్యాత్మిక బీజం నాటిన తల్లిదండ్రులకు.

కె. రాజ్యశ్రీ

# సంక్షిప్తంగా

1. "బాలాదపి సుభాషితమ్" మంచిమాట పసిబిడ్డ నుంచైనా నేర్చుకోవాలి.
2. ధార్మిక జీవనమే ఆధ్యాత్మికత.
3. మహాత్ములు, యోగులు మోక్ష సాధనకు దారి దీపాలు.
4. ప్రతిపనీ భగవదర్పణం కావించు - ప్రతిక్షణం జీవించు.
5. భగవంతుని కృపకు దానము ఒక సోపానము.
6. మంచి జరిగినా చెడు జరిగినా దానిలో భగవంతుని దయను చూడాలి.
7. జ్ఞానమనే ఆయుధంతో అహంకార మమకారమనే అజ్ఞాన వృక్షాన్ని పెరికివేయాలి.
8. నిజమైన నమ్మకమే - నిజమైన జ్ఞానము.
9. నిష్కల్మషంగా నిత్యమూ సంతోషముగా జీవించాలి.
10. న్యాయబద్ధమైన సంపాదన వలన మనశ్శాంతి, ఆరోగ్యము.
11. మనలోనే ఉన్న పరమాత్మను జ్ఞానచక్షువు ద్వారా దర్శించి తరించడంలోనే సుఖము - శాంతి.
12. నిర్విచార, నిర్వికామ, నిష్కామ మౌనం వలన భగవంతుడి సందేశం వినగలుగుతాము.
13. పుట్టినది మొదలు పయనించేది మరణంవైపే. ఆ మరణాన్ని ఆనందంగా ఆహ్వానించడమే ఆధ్యాత్మికత.
14. సర్వేజనా సుఖినో భవంతు.

# నివేదన

మన ఋషులు, ఒక రోజుకి మనిషి యొక్క మనిషి ఉచ్ఛ్వాస నిశ్వాసాలను 21,600 సార్లుగా (ఇరవై ఒక వేల ఆరు వందలు) లెక్కకట్టి శాస్త్రాలలో నిక్షిప్తం చేశారు. ఈనాడు పాశ్చాత్యులు ఎంతో పరిశోధన చేసి తెలుకున్న విషయం, వేల సంవత్సరాలనాడే మన శాస్త్రాలలో పొందుపరిచారు మన భారతీయ ఋషులు. ఈ 21,600ఉచ్ఛ్వాస నిశ్వాసాలను మన శరీరంలోని షట్ చక్రాలకు అంటే మూలాధార చక్రం నుండి అజ్ఞాచక్రం వరకు అక్కడ నుండి సహస్రారం వరకు, ఈ చక్రాల అధిదేవతలకు, అంకితమిస్తూ, మనం నిత్యం చదువుకునేశ్లోక రూపకంగా మనకందించారు.

ప్రతి ఉదయం నిద్రలేవగానే ఈ శ్లోకాన్ని పఠిస్తే మన జీవితాన్ని ఆ పరాత్పరుడికి అంకితమిచ్చినట్లే.

"మమ ఉచ్ఛ్వాస నిశ్వాసాభ్యాం
షట్‌శత ఏకోత్తర వింశతి సహస్ర సంఖ్యా
అధిప గాయత్రీ మహామంత్ర జపం
యధాభాగ నివేదయామి"
మూలాధార మంటపమధ్య పీఠస్థితాయ
సిద్ధ లక్ష్మీ సహితాయ గం గణపతేనమః
ఆవాహనాది షోడశోపచార పూజామ్ సమర్పయామి
షట్ శత జప నివేదయామి
స్వాధిష్టానమంటప మధ్య పీఠస్థితాయ
సరస్వతీ సహితాయ అం బ్రహ్మణేనమః
ఆవాహనాది షోడశోపచారపూజామ్ సమర్పయామి
షట్ సహస్రజప నివేదయామి
మణిపూర మంటప మధ్య పీఠ స్థితాయ
లక్ష్మీ సహితాయ ఉం విష్ణవేనమః
ఆవాహనాది షోడశోపచార పూజామ్ సమర్పయామి
షట్ సహస్ర జప నివేదయామి

అనాహత మంటప మధ్య పీఠ స్థితాయ
పార్వతీ సహితాయ మం పినాకినేనమః
ఆవాహనాది షోడశోపచార పూజామ్ సమర్పయామి
షట్ సహస్ర జప నివేదయామి

విశుద్ధి చక్రమంటప మధ్య పీఠస్థితాయ
అవిద్యా సహితాయ జీవాత్మనే
ఆవాహనాది షోడశోపచార పూజామ్ సమర్పయామి
సహస్ర జప నివేదయామి

ఆజ్ఞేయ చక్రమంటప మధ్య పీఠస్థితాయ
విద్యా సహితాయ పరమాత్మనే
ఆవాహనాది షోడశోపచార పూజామ్ సమర్పయామి
సహస్ర జప నివేదయామి

సహస్రార కమలకర్ణిక మధ్య పీఠస్థితాయ
చిచ్ఛక్తి సహితాయ గురవేనమః
ఆవాహనాది షోడశోపచార పూజామ్ సమర్పయామి
సహస్ర జపనివేదయామి

సంక్షిప్తంగా:
షట్ శతం గణేశాయ
షట్ సహస్రం స్వయంభువే
విష్ణవే షట్ సహస్రంచ
షట్ సహస్రం పినాకినే
సహస్రం జీవాత్మనేదేవా
సహస్రం పరమాత్మనేదేవా
సహస్రం గురువేదేవా
అర్పయామి కృతంజపమ్.

# ప్రతి క్షణం జీవించు

కాలం యొక్క విలువ చాలా గొప్పదని మనందరికీ తెలుసు. మనం ఖర్చుచేసిన ఒక్క క్షణాన్ని కూడా, లక్షల రూపాలయలు వెచ్చించి తిరిగి పొందలేము. విలువైన మన జీవితాన్ని ప్రాంపంచిక సుఖాలకోసం, బద్ధకంతో, పాపాలు చేస్తూ వృధా చేసామంటే, తరవాతి జీవితంలో దాని గురించి పశ్చాత్తాపడినా లాంభంవుండదు. రామభక్త తులసీదాసు "చేజారిపోయిన క్షణం గురించి తలబాదుకోవడం, నా టైమ్ బాగాలేదని తప్పించుకోవాలని చూడటం, లేకపోతే భగవంతుడిని నిందించడం చేస్తూ వుంటారు. ఆలోచనా రహితంగా, ఒక లక్ష్యం లేకుండా జీవితం గడిపేవారు, తమ జీవితాన్ని పాడు చేసుకోవడమే కాకుండా, ఇతరులు తమను చూసి ఎగతాళి చేయడానికి అవకాశ మిచ్చిన వారవుతారు". అని అన్నారు.

అలాగే కవి గిరిధారి అంటారు "తప్పు చేసిన మనిషి తను చేసిన పని పదేపదే గుర్తుకువస్తూ అసహనంతో వుంటాడు. కాబట్టి ప్రతి మనిషి, తన జీవితంలో ప్రతిక్షణం అర్థవంతంగా, తనకు తృప్తి కలిగించే విధంగా గడపడం వలన జీవితంలోని మాధుర్యాన్ని చవిచూడ గలుగుతాడు. ఎప్పుడూ సంతోషంగా వుండగలుగుతాడు" అని.

సమయాన్ని సద్వినియోగం చేశాము అని తృప్తి కలిగినవాడు ప్రాపంచిక సుఖాలనుంచి దృష్టి మరల్చి, ఆధ్యాత్మికతవైపు దృష్టిసారించి సాఫల్యం పొందగలుతాడు.

ఈవైపుగా ఎప్పుడైతే, మనిషి దృష్టి సారిస్తాడో, అతనికి ధైర్య సాహసాలు, నాయకుడి లక్షణాలు ఉదారత్వం, తృప్తి సేవాతత్పరత, అన్నింటినీ మించి ప్రశాంతత, ఆత్మానందం లభ్యమవుతాయి.

అయితే మనలో చాలా మంది ''ముద్దకీ పొద్దుకీ మధ్య సతమవుతున్నాము. ఈ యోగ, ధ్యానం, సేవాతత్పరత, ఆధ్మాత్మిక చింతనకు సమయమెక్కడిది? అన్ని బాధ్యతలు తీరాక అప్పుడు ఇటువంటివాటికి సమయం కేటాయించవచ్చు. ఇప్పుడు ఈ సంసారం బాధ్యతల్లో కూరుకుపోయి, చావడానికి కూడా తీరికలేదు' అని అంటూ వుంటారు.

మనం ఎంతకాలం జీవిస్తామో మనకి తెలియదు. బయటికి వెళ్తే తిరిగి వస్తామో లేదో తెలియదు. కాబట్టి వస్తు, విషయాసక్తి సమకూర్చుకోవడంలోనే సమయం గడిపేయ కూడదు.

నిర్దిష్ట సమయపాలన ద్వారా ప్రాపంచిక విషయాలతోపాటు, ఆధ్యాత్మిక చింతన కూడా అలవరచుకోవచ్చు. దీనికి ఎంత టైమ్ కేటాయించాలో, ముందుగానే ప్రణాళిక వేసుకుంటే జీవితాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు.

భగవద్గీత "ఆత్మసంయమన యోగం" 17వ శ్లోకంలో" మితనియత కర్మలూ, మితాహారం, మితమైన నిద్ర, మెలకువ కలిగిన వారికి యోగం సిద్ధిస్తుందని శ్రీకృష్ణ పరమాత్మ తెలిపారు. అన్నీ మితంగా అంటే సమయపాలన ద్వారా మనకు యోగం సిద్ధిస్తుంది.

రోజులోని 24 గంటలను నాలుగు భాగాలుగా విభజించవచ్చును.

6 గంటలు - సంపాదన కొరకు

6 గంటలు - భోజనం, విశ్రాంతి, సేవా కార్యాక్రమాలు

6 గంటలు - నిద్ర కొరకు

6 గంటలు - యోగ, ధ్యానం, ఆత్మ - పరమాత్మ గురించి తెలుసుకోవడం కోసం వెచ్చించవచ్చు.

ఇంకొంచం విశదంగా చెప్పాలంటే ఈ క్రింది విధంగా రోజును ప్రణాళికా బద్ధం చేసుకోవచ్చు.

ఉ॥ 4-5 వరకు - కాల కృత్యాలు, స్నానాదికాలు

ఉ॥ 5-8 వరకు - దేవుని పూజ, భజన, ధ్యానం

ఉ॥ 8-10 వరకు - చేయవలసిన పనులు, భోజనం మొ॥

ఉ॥ 10- సా॥5 వరకు - న్యాయబద్ధమైన ఉద్యోగ బాధ్యతలు

సా॥ 5-7 వరకు - సేవా కార్యక్రమాలు లేదా తన మనసుకి నచ్చిన న్యాయపరమైన కార్యక్రమాలు

సా॥ 7-9 వరకు - శరీరానికి తగిన ఆహారం తీసుకోవడం

రాత్రి 10 గంటల నుంచి ఉ॥ 4 గంటల వరకు -నిద్ర

పైన చెప్పిన, సమయపాలన విధంగా, వారి ఇష్టానుసారం, ప్రాంతీయ సౌలభ్యం కోసం, కొంత మార్పులు చేసుకోవచ్చు. దీని వలన సమయం వృధా చేస్తున్నామని కానీ, సమయం సరిపోవడం లేదని కానీ, మన శక్తి, డబ్బు వృధా అయినాయని కాని బాధగానీ వుండదు.

"వ్యావహారిక బాధ్యతలు అవలంబిస్తూనే, పూజ, జపం, ధ్యానం కొనసాగించమనీ, చేసే ప్రతి పనినీ, తనకు అర్పించమనీ, తద్వారా తనను చేరుకోవడం తథ్యమని" శ్రీ కృష్ణ భగవానుడు గీతలో బోధించారు.

ఈ విధంగా సమయపాలనతో ప్రణాళికాబద్ధంగా ప్రతి క్షణం జీవిస్తే ఆత్మానందం మన సొంతం.

# జీవిత సాఫల్యం

లోకంలో ఉత్తమమైన మహాపురుషుడు, మహాత్ములకు మహాత్ముడైన వాడు ఈశ్వరుడొక్కడే. ఆ ఈశ్వరుని శరణువేడినంతనే అతడు స్వయంగా ప్రత్యక్షమవటంకానీ లేదా ఒక మహాత్ముని రూపంలో వచ్చి మనలను తరింపచేయటం కాని జరుగుతుంది. ఈ కలియుగంలో ఇతడు మహాత్ముడు, ఇతడు యోగి, ఇతడు జ్ఞాని అని తెలుసుకోవటం చాలా కష్టం. ఎంతో మంది తమను తాము గురువులుగా, భగవంతునిగా ప్రకటించుకుంటున్నారు.

వీరు శాస్త్రప్రసంగం ద్వారా, సత్సంగాల ద్వారా జనులను ఆకర్షిస్తున్నారు. అయితే కేవలం వీటిని వినినంతనే ముక్తి కలుగుతుందని భ్రమ పడకూడదు. ఈ ప్రసంగాల ద్వారా సంసార బంధముల నుండి వైరాగ్యం కాకుండా, పరమాత్మ తత్వము తెలుసుకొని ఆ వైపుగా పయనించాలి. అప్పుడే ఉప దేశలాభాన్ని పొందగలుగుతాము. దీనికి ఉదాహారణగా ఒక కథ వుంది.

ఒక రాజుగారి దగ్గరకు, ఒక పెద్ద పండితుడు ప్రతిరోజు వచ్చి పురాణగాధలు, ధర్మాలు, శాస్త్రాలు వినిపిస్తూ వుండేవాడు. దీనికి ప్రతిఫలంగా రాజు అతనికి కొంత ధనము వేతనంగా ఇస్తుండేవాడు. ఇలా కొన్ని సంవత్సరాలు గడిచి పోయాయి ఒక రోజు రాజు పండితునితో "స్వామీ! మీరు ప్రతిరోజు నాకు భక్తి జ్ఞాన వైరాగ్యముల గురించి బోధ చేస్తున్నారు. మీ ప్రసంగం విని నాలో ఏవిధమైన మార్పుగాని, ఆధ్యాత్మిక చింతనగానీ రాలేదు. నా సమయము, మీ సమయము వృధా అవుతున్నది. డబ్బు ఖర్చు అవుతున్నది కానీ ఉపయెగం కనబడుట లేదు. దీని గురించి మీరు ఆలోచన చేసి ఏమిచేస్తే బాగుంటుందో సెలవివ్వండి. లేకపోతే మీకిచ్చే భృతి ఆపివేయబడుతుంది" అని చెప్పాడు. పండితుడు హతాసుడై ఏమీ పాలుపోక, ఆలోచనలో పడి ఇంటిముఖం పడుతుండగా దారిలో ఒక మహాత్ముడు కలిశాడు. పండితుని ముఖం విచారణగా ఉండటంచూచి కారణమడిగాడు. పండితుడు రాజు తనతో చెప్పిన విషయము మహాత్ముడికి వివరించాడు. అందుకు ఆ మహాత్ముడు

"దీనికి విచారమెందుకు? నన్ను మీ శిష్యుడిగా రాజుగారికి పరిచయం చేయండి. రాజుగారితో మీ ప్రశ్నకు సమాధానం నేనే కాదు, నా శిష్యుడు కూడా చెప్పగలడు అని చెప్పండి అన్నాడు. పండితుడు అదేవిధంగా రాజుకి పరిచయం చేసి మహాత్ముడు చెప్పిన విధంగా రాజుకు చెప్పాడు. రాజు 'సరే నీ శిష్యుడినే సమాధానం చెప్పమను" అన్నాడు.

అంతట ఆ మహాత్ముడు, రాజా! చాలా సంవత్సరాలుగా మీరు భక్తి జ్ఞాన వైరాగ్యాల గురించి విన్నా, దాని ప్రభావం మీమీద లేదెందుకని అని మీ ప్రశ్నకదా అనడిగాడు! రాజు 'అవును' అదే నా ప్రశ్న అన్నాడు. అందుకు ఆ మహాత్ముడు 'రాజా! మీ రాజ్యాధికారాన్ని నాకు రెండు గంటలు అప్పచెప్పండి మీ ప్రశ్నకు జవాబు దొరుకుతుంది అన్నాడు. అందుకు రాజు సమ్మతించి, మంత్రిని, సేవకులను పిలిచి "నేను రెండు గంటలు ఇతనికి రాజ్యాధికారాన్ని ఇస్తున్నాను. అతను చెప్పిన విధంగా నడుచుకొమ్మని" చెప్పాడు. అంతట మహాత్ముడు రాజ్యసింహాసనంపై కూర్చొని మొదట పండితుడినీ, తరువాత రాజుగారినీ కూడా తాళ్ళతో బంధించమని ఆజ్ఞాపించాడు. ఆజ్ఞప్రకారం వారిద్దరూ బంధించబడ్డారు. మహాత్ముడు చెప్పిన విధంగా పండితుడు 'రాజా నన్ను బంధ విముక్తిడిని చేయండి' అని అడిగాడు. అందుకు రాజు "ఇప్పుడు నా ఆజ్ఞ నడువదు. అయినా నేను కూడా బంధించబడ్డాను. నిన్ను ఎట్లు విడిపించను?" అని అడిగాడు. అప్పుడు మహాత్ముడు రాజుతో రాజా మీరు ఇన్ని సంవత్సరాలుగా ఈ పండితుని ప్రసంగాలను వింటున్నారు. మిమ్మల్ని బంధ విముక్తుల్ని చేయమని అతనిని కోరండి' అని చెప్పాడు. రాజు అడిగినంతనే పండితుడు రాజా! నేనే బందీని మిమ్మెట్లు విడిపించను? అని ప్రశ్నించాడు. సింహాసనాన్ని అధిష్టించిన మహాత్ముడు "రాజా! మీ ప్రశ్నకు సమాధానం దొరికిందా? ఈ పండితుడు స్వయంగా బందీ అయినప్పుడు మిమ్ములను ఎట్లు బంధం నుండి విడిపించగలడు. అసలు విషయమేమంటే, ఈ పండితుడు ప్రతిరోజూ తన ప్రసంగాన్ని మీకు వినిపిస్తున్నాడే కాని స్వయంగా సంసార బంధంలో చిక్కుకున్న ఈయన ద్వారా, మీకు సంసార బంధం నుండి విముక్తి, వైరాగ్యము లభించలేవు. కేవలం శాస్త్ర ప్రసంగాలను చెప్పడం ద్వారా,

వినడం ద్వారా ముక్తి కలుగదు అని రాజు గారిని సమాధాన పరిచాడు. దీనిని బట్టి పండితుల ప్రసంగాలు, సత్సంగ గోష్టులు, దైవానుగ్రహం ముక్తినిస్తాయను కోవటం సరైనది కాదు. మహాత్ములు, యోగులు మనలను ముక్తి మార్గంలో నడిపించటానికి ఉపదేశమివ్వగలరే కానీ, ఆదేశించలేరు. వారి యొక్క ఉపదేశ సారాన్ని శ్రద్ధగా విని, ఆకళింపు చేసుకొని ఆచరణలో పెడితేనే భగవదనుగ్రహం కలుగుతుంది. ఎవరి సాంగత్యం వలన, భాషణం వలన, ధర్మాచరణం వలన మనకి భక్తి, జ్ఞాన వైరాగ్యములు కలుగుతాయో, ఆ మహనీయులు దైవసంపద గలిగినవారిగా గుర్తించి, శుశ్రూష చేసి ముక్తికి మార్గం తెలుసుకోవాలి. ఆ దిశగా మన తనువు, మనసు, బుద్ధి, ఇంద్రియాలను నడిపించి జీవన సాఫల్యాన్ని పొందాలి.

# గృహస్థాశ్రమమొక గొప్పయోగం

అరణ్యాలకు వెళ్ళి, ముక్కుమూసుకొని తపస్సు చేస్తేనే సత్వర మోక్ష సిద్ధి లభిస్తుందని మనలో చాలా మంది అభిప్రాయ పడుతూ వుంటారు. ఈ సంసార జంజాటంలోపడి కొట్టుకుంటున్న తమకు సిద్దిపొందే అవకాశం లేదని నిరాశ నిస్పృహలకు లోనవుతుంటారు.

ప్రపంచం నుంచీ, బంధాలనుంచీ పారిపోకుండా సమాజంలోనే ఉంటూ ధర్మబద్ధమైన జీవితం గడుపుతూనే మోక్షం పొందవచ్చనేది గీతా సారాంశం. అయితే ఆధ్యాత్మిక సాధన చేసేటప్పుడు కొంత శక్తిని పొందగానే అహంకారంతో 'నేను గొప్ప సాధకుడిని' 'గొప్ప తపస్విని' అని గర్వించటం వలన తపఃఫలము కోల్పోయి యధాస్థితికి చేరుకోవడం జరుగుతుంది.

గృహస్థాశ్రమం లంపటమని, ప్రపంచానికి దూరంగా వెళ్ళి ఆధ్యాత్మిక అభివృద్ధి సాధించాలని అరణ్యాలకు వెళ్ళి తపస్సు చేసుకొని శక్తిని సంపాదించిన ఒక యోగి కథ ఈ విధంగా ఉంది.

ఒక యోగి పుంగవుడు గృహస్థాశ్రమం విడిచి సిద్ధికోసం అరణ్యాలను వెళ్లి తపస్సు చేశాడు. నిష్టతో, నిశ్చలంగా కూర్చుని చేసిన తపస్సు వల్ల శక్తి లభించి మరింత యోగ సాధన కావించాడు. ఆ నిశ్చలత వలన అతని జుట్టు జడలు కట్టి గుబురుగా మారింది. దానిలో ఒక పిచ్చుక జంట కాపురం కూడా పెట్టింది. కొంత కాలానికి సమాధిస్థితిని నుండి బయటికి వచ్చిన యోగి, తన తలపై ఏర్పడిన పక్షిగూడ గమనించాడు. తనకు చాలా గొప్ప సమాధిస్థితి కలిగిందని, ఒక పక్షి జంటకు తన శిరస్సుమీద ఆశ్రయం కలిగించగలిగానని, తృప్తితోపాటు కాస్త గర్వపడ్డాడు.

అంత, పిచ్చుకలజంట 'యోగీ! ఆధ్యాత్మిక శక్తిని సాధించానని అహంకరించకు నగరానికి వెళ్ళి కాశీపతిని కలుసుకో' అన్నాయి. యోగి ఆశ్చర్యచకితుడై కాశీపతిని కలుసుకోవడానికి నగరానికి బయలుచేదరాడు. అక్కడ ఆరా తీయగా అతను ఒక వ్యాపారి అని తెలిసింది. కాశీపతి తనకంటే గొప్ప యోగి, ధార్మికుడు అయివుండి పెద్ద ఆశ్రమంలో ఉంటాడని

ఊహించాడు. అందుకు భిన్నంగా అతడు ఒక సామాన్య వ్యాపారిగా జీవనం గడుపుతున్నాడు. అతడిని పలుకరించబోయాడు యోగి. వెంటనే కాశీపతి మహాత్మా! వందనం. మీ తపస్సు అమోఘం, పిచ్చుకలు తలపై కాపురం ఉన్నా, చలించని నిష్ఠమీది" అన్నాడు.

తన పరిచయం లేకుండానే తన గురించి చెప్పగలిగే శక్తి ఆవ్యాపారికి ఎలా వచ్చిందని ఆశ్చర్యపడి అతడికి నమస్కరించి వివరాలడిగాడు. అంతట కాశీపతి తాను సామాన్య వ్యాపారిననీ, తాను చేసేపని చిత్తశుద్ధితో ధర్మబద్ధంగా చేయటమే తనకు తెలుసుననీ, న్యాయంగా తనకు లభించిన దానినే సంతృప్తిగా అనుభవిస్తున్నానని తెలిపాడు. ఎవరినీ నిందించటంగానీ, హింసించటంగానీ చేయనని, ధర్మాన్నీ, సత్యాన్ని ఆచరిస్తానని చెప్పాడు. కీర్తికోసం ఏపనీ చేయనని అందువల్లనే తనకంత శక్తి వచ్చిందని, తన మాటలు నిజమో కావో, యోగి తలపై ఉన్న పిచ్చుక జంటను అడిగి తెసుకోమని వినమ్రంగా తెలిపాడు. అంతట యోగి 'పిచ్చుకలు ధర్మాలు కూడా చెబుతాయా' అని ఆశ్చర్యపోతుండగానే అవి నింగికెగిరి యోగి పుంగవా! నీకు సరైన మార్గం చూపించటానికి ధర్మదేవత మమ్మల్ని పంపించింది. ధర్మాచరణలో అసూయ పనికిరాదు, శ్రద్ధ ముఖ్యం, నెత్తిమీద గూడు వున్నా చలించలేదని గర్వించావునువ్వు. ఇంత సంసార భారం మోస్తున్నా నిర్వికారంగా, ధర్మపథంగా జీవిస్తున్నాడు ఈ వ్యాపారి. ఇది ఇంకా గొప్ప యోగం అని అన్నాయి. ఆ బోధతో గృహస్థాశ్రమము ఒక గొప్ప యోగము అని యోగి పుంగవుడికి కనువిప్పు కలుగి సెలవు తీసుకున్నాడు.

ఈ కథ ద్వారా మనం తెలుసుకున్నదేమంటే ధార్మిక జీవనమే ఆధ్యాత్మికత. మన కర్తవ్యాన్ని ధర్మ బద్ధంగా ప్రతిఫలాపేక్ష లేకుండా నిర్వహించడమే అసలైన తపస్సు. అసూయ, అహంకారాలను వదలి సాత్విక జీవనం గడపటం ద్వారా ఆత్మజ్ఞానాన్ని పొందగలము.

# దానం-భగవంతుడిని చేరే మార్గం

త్యాగబుద్ధితో పాత్రనెరిగి అంటే ఎవరికి ఏ వస్తువు లేదో ఆ వస్తువు దానమిచ్చి ఎలాంటి ఫలితాన్ని ఆశించకపోవడం ఉత్తమమైన దానం. దానం మూడు రకాలు: 1) నిష్కామభావనతో ఆకలిగొన్న వారికి ఆహారం, దప్పికగొన్నవారికి నీరు ఇవ్వడం సాత్వికదానం. 2) గౌరవ ప్రతిష్టలకోసం చేసే దానం రాజసదానం. 3) అయోగ్యునికి చేసే దానం తామసమని అంటారు గొప్పదనం కోసం చేసే దానము పతనాన్ని కలిగిస్తుంది. భూకంపము, కరువుకాటకములు సంభవించి నప్పుడు ఆపదల పాలైనవారికి సాయం అందించడం, ఆహారమందించి ప్రాణాలు నిలపడం వంటివి చాలా ఉత్తమమైన దానం. కష్టాల్లో ఉన్నవారికి చేయూతనివ్వడం వలన ఎక్కువ ఆత్మ సంతృప్తి కలుగుతుంది. మనసు సంతృప్తినిచ్చే దానం చేసినప్పుడు నింద వచ్చినా, అది మనమంచికే అని భావించుకోవాలి. "కబీరుదాసు అంటారు'నిందించేవారికి ఇల్లు నిర్మించి అయినా దగ్గరకు చేర్చుకోవాలి" అని. ఎందుకంటే నీళ్లు, సబ్బులేకుండానే పరిశుభ్రం (మన అంతఃకరణను) చేసుకోవడానికి అతను ఉపయోగపడతాడు. శ్రీ షిరిడి సాయినాథుడు కూడా "మనల్ని తిట్టేవారిని గౌరవించాలి ఎందుకంటే వారి నాలుకతో మనలోని మురికిని శుభ్రం చేస్తారు కనుక' అని అన్నాడు. వారు నిందించారని వగచేకంటే, మనలోని దుర్గుణాలను సరిచేసుకోవాలి. ఇదే సత్పురుషుల లక్షణం. కాబట్టి సద్భావనతో యోగ్యునికిచ్చే దానం దాతకీ, గ్రహీతకీ కూడ శుభాన్ని కలిగిస్తుంది. ధనవంతుడైన వ్యక్తి ఇచ్చే లక్షరూపాయల దానం కంటే, పేదవాడు ఇచ్చిన రూపాయిదానం గొప్పది. ఎందుకంటే రూపాయి దానమివ్వడం అతనికి గొప్ప త్యాగం, భగవంతుని దృష్టిలో అసలైనదానం.

సంత్ ఏకనాథుడు ఒకసారి కావడిలో నీరు తీసుకొని ప్రయాగనుండి రామేశ్వరంలో ఈశ్వరుని అభిషేకానికి సమర్పించాలని బయలు దేరాడు. మార్గమధ్యంలో అతనికి దాహంతో అలమటిస్తూ చతికిల పడిన ఒక గాడిద కనిపించింది. ఏకనాథుడు కావడిలోని నీటిని గాడిదకు కొంచెం తాగించాడు. దానిలో చలనం చూసి కొద్ది కొద్దిగా నీటినంతా తాగించాడు. ఆ గాడిదకు

ఓపిక వచ్చి లేచి వెళ్లిపోయింది. తోటి యాత్రికులు ఏకనాథుడుతో 'నీ నీరు వృధా అయ్యింది యాత్రకూడా నిష్ఫలమయింది" అని వాపోయారు. దానికి ఏకనాథుడు నవ్వి భగవంతుడు ప్రాణులన్నింటిలో ఉన్నాడని తెలిసికూడా మీరు ఇలా మాట్లాడడం బాగోలేదు. నా పూజ మాత్రం ఇక్కడినుంచే రామేశ్వరంకు చేరుకుంది. పరమేశ్వరుడు నా జలాన్ని స్వీకరించాడు" అని వారికి తెలియజెప్పి వెనుదిరిగాడు.

బాధలో ఉన్న ఏ ప్రాణికైనా అవసరమైన దానంచేస్తే అది అనంతమైన పుణ్య ఫలాన్నిస్తుందని దీని ద్వారా మనకు బోధపడుతుంది. భగవంతుని కృపకు పాత్రులమవ్వడానికి దానము ఒక సోపానముగా ఉపయోగపడుతుంది.

# భగవంతుని దయ

"అంతా ఆ భగవంతుని దయ" అని చాలా సందర్భాలలో చాలా సార్లు అంటూ ఉంటాము. నిజమే ఈ సృష్టి యావత్తూ భగవంతుని కృపా కటాక్షాలమీద ఆధారపడి వుంది. ఆయన దయ మన మీద ఉందని విశ్వసిస్తే మనలో ఎంతో ప్రసన్నత శాంతి ఏర్పడతాయి. నిజానికి దేవుడి దయ మనపై ఎంత ఉందనుకుంటామో అంతుకు వేల,లక్షల రెట్లు ఆయన మనపై కురిపిస్తాడు.

గతి తప్పని సూర్యచంద్రుల ఆగమ నిష్క్రమణలు, రకరకాల జంతు జాలాలు, పక్షులు, వృక్షాలు, చైతన్యం తొణికిసలాడుతున్న ప్రకృతి, మేధస్సు కలిగిన మానవ జాతి సృష్టి, మంచి చెడులు తెలియజేసె ఆత్మసాక్షి, ఇవన్నీ కూడా దేవుని ఆజ్ఞానుసారం సక్రమంగా చాల సహజంగా జరిగిపోతూ వుంటాయి.

జరుగుతున్నదంతా భగవంతుని ఆజ్ఞతో జరుగుతుంది. దానికి విరుద్ధంగా ఆలోచిస్తే అది మూర్ఖత్వమూ, సహేతుకంగా ఆలోచిస్తే ఆయన దయాతత్వమూ అర్థమౌతుంది. దేవుడిపై విశ్వాసము, శ్రద్ధా ఉండాలి. విశ్వాసం లేని ఒక నాస్తికుడి కథ తెలుసుకుందాము.

ఒక ఆస్తికుడు, నాస్తికుడు ఒక మామిడి చెట్టు కింద కూర్చొని పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నారు. మాటల సందర్భంలో "భగవంతుడు ఎప్పుడూ పొరపాటు చెయ్యడు. అతని ద్వారా జరిగే ప్రతి పనీ మంగళ కరమే" అని ఆస్తికుడన్నాడు. అది విని నాస్తికుడు "నువ్వన్నదానితో నేను ఏకీభవించను. ఇక్కడ ఇంత పెద్ద మామిడి చెట్టు ఉంది కదా! దీనికేమో చిన్న చిన్న పండ్లనిచ్చాడు. అదే గుమ్మడి పాదు ఉంది. దానికి దాదాపుగా నాలుగు లేక ఐదు కిలోల బరువుతో గుమ్మడి కాయలు కాస్తాయి. ఇది చూస్తేనే తెలుస్తోంది మీ దేవుడు బుద్ధి తక్కువ వాడని" అని ఆస్తికుడిని ఎద్దేవా చేశాడు.

ఇంతలో ఒక మామిడి పండు రాలి అతని తలపై పడింది. దానితో నాస్తికుడి తలకు చిన్న గాయమయింది. అతడికి తెలియకుండానే నాస్తికుడి నోటి వెంట 'దేవుడా' అన్న మాట వెలువడింది.

వెంటనే ఆస్తికుడన్నాడు.'దేవుడికి బుద్దిలేదు అంటూనే చిన్న కష్టం రాగానే దేవుడా అని స్మరించావు. దేవుడు తెలివిగల వాడు కాబట్టే చిన్న పండ్లను సృష్టించాడు. ఇదే ఐదు కిలోల మామిడి పండు నీతలపై పడితే నీ పరిస్థితి ఎలా ఉండేదో ఆలోచించు, తల పగిలి ఉండేది. ఇప్పుడైనా గ్రహించు. భగవంతుడెప్పుడూ పొరపాటు చెయ్యడు. దేవుడా అనగానే అతని ఆపారమైన దయ నీపై కురిపించాడు. ఇది నీవు అంగీకరించాలంటే అయనపై శ్రద్ధా విశ్వాసము కలిగివుండాలి అన్నాడు ఆస్తికుడు.

భగవంతుని దయ నివురు కప్పిన నిప్పులాంటిది. అక్కడ నిప్పు ఉన్నదని తెలియనప్పుడూ వెచ్చదనం ఉంటుంది. దీనిని బట్టి ఆలోచించాల్సిందేమంటే అజ్ఞానమనే నివురగప్పిన అగ్ని గురించి మనకు తెలిసినా తెలియకపోయినా, ఎలాగైతే వెచ్చదనం కలిగిస్తుందో తెలియకుండా భగవంతునిపై భక్తిని చూపినా, దాని లాభము తప్పకుండా ఉంటుంది. దేవుడి ఉనికిని ఆంగీకరించి భక్తిని చూపితే ఎక్కువ లాభం వుంటుంది. ఆ భక్తి నిష్కామ భక్తి అయితే ఆ లాభానికి అంతే వుండదు. అదే దేవుడి దయ అతడి దయ మొదటి నుండీ వుంది. అయితే మనకు అన్నీ సవ్యంగా జరుగుతున్నప్పుడు ఆయన దయగా ఒప్పుకోము అంతా నాదే నని భ్రమించి తిరుగుతుంటాము. భగవంతుని గురించి తెలుసుకోవాలను కునేవారికి, ఆయన తనను తాను వెల్లడి చేసుకుంటాడు. ఆయన తత్వం తెలుసుకున్న మహాత్ములు ఈ సృష్టిలోని ప్రతి చర్య అంతులేని భగవంతుడి దయగా భావిస్తారు. వారికి అసంభవమైనది ఏదీ ఉండదు.

మనం అనుకోవచ్చు ఆయన దయ వుంటే కొంత మందికి కష్టాలు ఎందుకువస్తాయి? వారి మీద దయలేదా? అని దేవుడు మన హితం కోరే దండన చేస్తాడు. ఎలాగంటే మనం చేసిన పాపాలకు పాప ఫలాన్ని అనుభవింప జేసి వేల లక్షల జన్మల నుండి మనల్ని విముక్తుల్ని చేస్తాడు. ఏది జరిగినా దానిలో కేవలము భగవంతుని దయనే చూడాలికానీ చింతించకూడదు. ఆయన దయ నాపై చాలా ఉంది. అందుకే ఈ కష్టాలను ఈ జన్మలోనే పరిసమాప్తి చేస్తున్నాడని చింతన చేస్తే ఎంతో శాంతి ఏర్పడుతుంది. ఈ రీతిగా ఆలోచన చేసి భగవంతుని దయ మనపై అపారంగా ఉందని విశ్వసిద్దాం.

# పతనానికి తొలిమెట్టు 'అహం'

మనిషి ఎన్ని శాస్త్రాలయినా, ఎన్ని వేదాలయినా చదవవచ్చు. ఎన్ని బోధనలయినా వినవచ్చు. తపస్సు చేసి వరాలయినా పొందవచ్చు. కానీ అహాన్ని మాత్రం దగ్గరకు రానీయకూడదు. మనిషి, క్రోధ, లోభ, మోహ, మదమాత్సర్యా లనే అరిషడ్వర్గాల గణంలో పరిభ్రమిస్తూ వాటి అనుయాయులైన అహంకార మమకారాలలో కొట్టుమిట్టాడుతూ జీవితాన్ని వ్యర్థంగా గడుపుతుంటాడు. అదిమానవ నైజము. మహామహులుకూడా వీటికి లొంగిపోతుంటారు.

ముక్కుమూసుకుని వనవాసం చేసే ఋషి "నేను అన్నీ వదిలేశాను" అని అనుకుంటే అహానికి లొంగినట్లే. ఆయన ఉతికి ఆరవేసుకున్న గోచీగుడ్డ గాలికి ఎగిరిపోతుంటే "అయ్యో! నా గోచీగుడ్డ" అనుకున్నాడా! మమకారం అతన్ని ఆవరించి వున్నట్టే.

సాక్షాత్తు విష్ణుమూర్తి అవతారమైన శ్రీరాముడు ఒక రోజు వశిష్ట మహాముని కుటీరానికి వెళ్ళి తలుపు తట్టాడు. "ఎవరు వచ్చింది"? అన్నారు మహర్షి "నేను స్వామీ దశరథ రాముడిని" అని జవాబిచ్చాడు. "నేను పోయాక రా" అన్నాడు వశిష్టులవారు. ఖంగుతిన్న రాముడు వెనుతిరిగి వెళ్ళిపోయాడు. మరునాడూ అంతే. తనేం అపరాధం చేశాడని గురువుగారు అలా కఠినంగా అంటున్నారు? వారు పోయాక నేను వెళ్ళడం ఏమిటి? అని ఆలోచనలో పడ్డాడు. మూడవ రోజు అర్థమయింది ఆయనకు. నేను పోయాక అంటే అర్థం గురువుగారు పోయక కాదు. "నేను అన్న భావం పోయాక అని మరునాడు పరుగున వెళ్లాడు. "ఎవరది" అన్న ప్రశ్న వినపడగానే "తమరేస్వామి" అన్నాడు. వశిష్టుల వారు తలుపులు తెరచి రాముడిని కౌగలించుకున్నాడు. ఆ కౌగిలింతలో అహం కరిగిపోయింది. అది శ్రీరాముడికి శాశ్వత కీర్తిని సంపాదించి పెట్టింది.

ఇటువంటిదే నహుష చక్రవర్తి జీవిత చరిత్ర నహుషుడు తల్లి గర్భంలో వున్న నాటి నుంచి ఎన్నెన్నో ప్రమాదాలకు గురయి, చివరకు వశిష్ట మహాముని ఆశ్రమంలో పెరిగి పెద్దవాడయ్యాడు. శ్రీ దత్తప్రభువు దయవల్ల ఎన్నో శక్తి సామర్థ్యాలు సంక్రమించి, మహారాజయ్యాడు. ఎన్నో యజ్ఞయాగాదులు చేసిన పుణ్యఫలముగా ఇంద్ర పదవిని అధిష్టించగలిగాడు. ఇంత వరకు బాగానే

జరిగింది. ఇక అక్కడ నుంచీ అహంకారం అతని కళ్లను కప్పింది. తన పల్లకీని మోయమని ఋషులను అజ్ఞాపించాడు. తన పల్లకీని మోస్తున్న అగస్త్యమహర్షిని "సర్ప సర్ప" (కదులు, కదులు) అంటూ కాలితో తన్నాడు. దానితో అగస్త్య మహర్షి కోపించి, అహంకారంతో కన్నూ మిన్నూ కానకున్నాడని సర్పముగా మారి భూలోకంలో పడివుండమని శపించాడు. అలా నహుష చక్రవర్తి సర్పముగా మారి ఎన్నో శతాబ్దాలు భూలోకంలో పడివున్నాడు. ద్వాపరయుగంలో భీమసేనుడిని బంధించగా ధర్మరాజు భీముని వెదకుతూ వచ్చి, నహుషుడు వేసిన ప్రశ్నలకు జవాబులిచ్చి భీముడిని విడిపించుకున్నాడు. అప్పటికి నహుషుడికి శాపవిముక్తి కలిగింది. యజ్ఞయాగాదులు చేసి ధర్మ ప్రవర్తకుడిగా జీవించినవాడు ఎందుకు పతనం కావలసి వచ్చింది? సర్పరూపుడై అన్ని ఇక్కట్లు పడవలసి వచ్చింది. కేవలం నా అంతటి వాడు లేడని అహంకరించటం వలన నాది అన్న భావం దుఃఖానికి మూలం. 'నాదికాదు' (నమమ) అన్న భావం ఆనందకారకం. సంసారమనే అజ్ఞాన మహావృక్షానికి మనస్సేపాదు. అహంకారం బీజం. ఈ బీజమే "ఇంతై వటుడింతై" అన్నట్లు పెరిగి పెరిగి మోక్ష మార్గానికి అడ్డుగా నిలుస్తుంది.

"ఆశనం మే, వసనంమే, భార్యమే, బంధువర్గోమే ఇతిమేమే కుర్వంతః కాలవృకో హంతి నరాణామ్" ఈ తిండినాది ఈ బట్టనాది ఈ భార్యనాది, ఈ బంధువులంతా నావారు. ఇలా మే మే (నాది నాది) అనే మనుష్యులనే మేకలను, కాలం అనే తోడేలు చంపి తిటుంది.

కాబట్టి మనం జ్ఞానమనే ఆయుధంతో, అహంకార మమకారాలనే అజ్ఞాన వృక్షాన్ని తొలగించి, మార్గం సుగమం చేసుకుంటే కానీ ముక్తి సాధానికి త్రోవ కనిపించదు.

అయితే ఈ జ్ఞానాన్ని సత్సంగాల ద్వారా విని అలాగే ప్రవర్తించాలి అని అనుకుంటాము. కానీ కుక్కతోక వంకరలా అది కాసేపు వుంటుంది. మళ్లీ ఇంద్రియాలకు వశమయి... "నా అంతటివాడు లేడు. వాడిని చెరిగేశాను" నన్నే ఇంత మాటంటాడా? వీడి సంగతి చూస్తాను. ఇలా పరిపరి విధాలుగా అహంకారాన్ని వ్యక్తం చేస్తూ వుంటాము. చంచలమైన ఈ మనస్సును అరికట్టాలి, అంటే సద్గ్రంథ పఠనం, నిత్య సత్సంగం, ఆత్మవిచారం అలవరచుకొని, అహంకార మమకారాలను త్యజించి, అహంబ్రహ్మాస్మి" అనే స్థితికి చేరుకోవాలి.

# అశాంతికి మూలం

ప్రతిజీవికూడా పరమాత్మనుండి విడిపోయి బయటపడిన చిన్ని శకలమే. జీవి పుట్టగానే ఆశ అనే మాయ కమ్మేస్తుందట. తరువాత బాల్యం నుండి వృద్ధాప్యం వరకు ఇహలోకపు వాసనలలో పడి తల్లి, తండ్రి, అక్కచెల్లెళ్లు, అన్నదమ్ములు, బంధుమిత్రులు అనే బంధనాలలో చిక్కి కొట్టుమిట్టాడు తుంటాడు. అందమైన జీవితం ఏర్పాటు చేసుకోవాలనే తాపత్రయంతో ధనం సంపాదించి కోర్కెలను తీర్చుకుని జీవితంలో స్థిరపడతాడు. కొంతకాలానికి తాను అనుభవిస్తున్న ఆనందాలు, భోగాలు, చాలా రసహీనంగా కనిపిస్తాయి. ఏదో తెలియని ఆవేదన, అశాంతి మనుసులోపలి పొరల్లో తొలిచేస్తూవుంటుంది. కారణం తెలియక చికాకుగా, పరధ్యానంగా ఉంటాడు. చివరికెపుడో, ఏ సత్సంగాల ద్వారానో, సద్గురువు బోధనల వల్లనో తెలుస్తుంది. నీవు ఎక్కడినుండి వచ్చావో అక్కడికి చేరుకో! అప్పుడే నీకు పరమశాంతి అని ఆత్మచేసేబోధ అది. మహామహా చక్రవర్తులకు పరమయోగులకు కూడా ఈ ఆత్మఘోషతప్పదు.

కార్తవీర్యార్జునుడు అనే చక్రవర్తి శ్రీ దత్త ప్రభువును సేవించి తనకు వేయి చేతులు, అణిమాసిద్ధులు, తరువాత తన మరణం తనకన్నా శ్రేష్ఠుని చేతిలో సంభవించాలని వరాలు పొందాడు. చాలా కాలం అతడు ప్రజలను సుఖ సంతోషాలతో వారికి శత్రుభయంకానీ, చోరుల వలన దుస్వప్నాల వలన భయంగాని లేకుండా చాలా సమర్థవంతంగా పరిపాలన చేశాడు. అతని ప్రతిభ ఎంతటిదంటే ఈనాటికీ కార్తవీర్యార్జునుని పేరు తలచుకుంటే పోయిన వస్తువులు దొరుకుతాయని, చోర భయంగానీ వుండవనీ శాస్త్రాలు చెబుతున్నాయి.

<u>పోయిన విలువైన వస్తువులు దొరకడానికి:</u>

'సుమంతో సుమంతో శ్రీ కార్తవీర్యార్జునాయనమ:'

అనే శ్లోకాన్ని శ్రద్ధగా పఠించాలి.

<u>దొంగల భయం లేకుండా:</u>

'కార్తవీర్యార్జునోనామ
అజానుబాహు సహస్రవాన్
తస్యస్మరణ మాత్రేణ
చోరబాధా నివర్తతే'

అనే శ్లోకం చదువుకుని పడుకుంటే చోర భయం లేకుండా హాయిగా నిద్రపడుతుంది.

ఆయన ధర్మపాలకుడు అవడం చేత ప్రజలంతా ధర్మమార్గంలో నడిచేవారు. పండితులతో నిత్య గోష్ఠులు, రాచకార్యాల నడుమ శ్రీ దత్త ప్రభువు చెంతకు వెళ్ళి ఆయనను సేవించుకురావడం, రాణివాసంలో విందువినోదాలతో కాలక్షేపం చేయడంతో కాలం చాలా హాయిగా గడిచిపోయింది.

కొంత కాలానికి కార్తవీర్యార్జునుని మనసులో ఏదో తెలియని అసంతృప్తి, విసుగు, నిరాశ అలుముకోసాగాయి. ఏమిటీ జీవితం? ఎంత కాలమిలాగా? జీవితంలో ఇంత సాధించినా సంతృప్తిగా లేదెందువల్ల? అనే ప్రశ్నలు ముళ్ళలా అతని మనసుని తొలిచేస్తున్నాయి.

శ్రీదత్తస్వామి దర్శనం కోరి బయలు దేరాడు. ఇంత కాలం ఆయనకు దత్త దర్శనం అనుకున్న వెంటనే లభించేది. ఈసారి మాత్రం పరీక్షకు తట్టుకోవలసి వచ్చింది. భక్తులలో, ఆర్తులు, అర్థి, జిజ్ఞాసువు, ముముక్షువు అని నాలుగు రకాలు. 1) ఇహలోక వ్యాధులకు లోనైన తనను ఆదుకొమ్మని ప్రార్థించేవారు ఆర్తులు. 2) ఏదైనా ఒక ప్రయోజనాన్ని ఆశించి మొక్కుకునేవారు అర్థి. వీరు కష్టాలలో ఉంటారు. కనుక భగవంతుడు తొందరగా ప్రసన్నమై ఆదుకుంటాడు. 3) జిజ్ఞాసువు జీవితం యొక్క పరమార్థం, భగవంతుడు, ఆత్మతత్వం గురించి తెలుసుకోవాలనే కోరికతో వస్తాడు. ఇతడు అడుగుతున్నది నిజమే కాని తీసుకునే యోగ్యత అతనికి ఉందో లేదో చూడాలి. అందుకే పరీక్ష అవసరమవుతుంది. 4) ముముక్షువు మోక్షానికి త్రోవ చూపించమని గురువును ఆశ్రయిస్తాడు.

కార్తవీర్యార్జునుడు అశాంతికి మూలకారణం తెలుసుకోవాలనే జిజ్ఞాసతో దత్తుని ఆశ్రమానికి వెళ్ళాడు కాబట్టి అతన్ని పరీక్షించదలిచి, ఎన్ని విధాల ప్రార్థించినా దత్తుడు కనులు విప్పి చూడలేదు. కార్తవీర్యార్జునుడు శ్రీదత్తునికి ప్రణమిల్లుతూ స్తుతిస్తూనే ఉన్నాడు. కొంత కాలానికి శ్రీదత్తుడు కనులు తెరిచాడు. కానీ అతని వంక చూడలేదు. తాను దత్తునికి దూరమయ్యానని భావించి దాన్ని సహించలేక దుఃఖిస్తూ ఉండిపోయాడు.

కొంత తడవుకు శ్రీదత్తుడు ఆప్యాయంగా అతని కళ్ళలోకి చూసి ఏమిటినాయనా! నీ మనసులో ఉన్నదేదో చెప్పు. ఈ దుఃఖమేల? అని అన్నాడు.

"స్వామీ! మానవ జీవితంలో ధర్మార్థ కామాల ప్రభావం చాలా ఉంటుంది. చివరి పురుషార్థం కోసం తపన మాత్రం ఉంటుంది. మొదటి మూడు అనుభవించి విసిగిపోయాను. ఇక చివరిదైన మోక్షం ప్రసాదించండి" అని వేడుకున్నాడు.

శ్రీదత్తుడు నాయనా! మోక్షం కావాలని కోరావు. మోక్షం అంటే విముక్తి. అందుకు బద్ధుడైన వాడే విముక్తి పొందాలి. కనిపించేదంతా కరిగిపోయేదనీ, అశాశ్వతమనీ మనకు తెలుసు. ఇది అనుభూతిలోకి వస్తే విముక్తే. మన అజ్ఞానం వలన ఈ జగత్తు ఉన్నదనీ, ఉంటుందనీ భ్రమిస్తున్నాము. ఈ భ్రమను తొలగించి మనలోపలి జ్యోతిని చూడగలిగే చిత్తశుద్ధి కావాలి. చిత్తశుద్ధితో విద్యుక్త కర్మలు నిర్వహించి ఆ వచ్చిన ఫలితం భగవదర్పితం చేయాలి. అలా సర్వం సమర్పణ చేసుకున్న వాడికి లోకభ్రాంతి వదలి ఆత్మసాక్షాత్కారం కలుగుతుంది. ఆత్మతత్వాన్ని ధ్యానించగా ధ్యానించగా, ధ్యేయం, ధ్యాస ఒకటైపోతుంది. అప్పుడిక సృష్టిమొత్తం ఒకే ఆత్మపదార్థంగా కనిపిస్తుంది. అని బోధించారు. ఈ మాటలు అతనిలోని అశాంతిని పోగొట్టి ఆనందాన్ని నింపాయి. అయినా పట్టు వదలకుండా స్వామీ! నేను విన్నది నా మనసులో స్థిరంగా నిలవాలి కదా! నా చాంచల్యం పోయి ఆత్మవిచారాన్ని గట్టిగా పట్టుకునే మార్గంచూపి తరింపచేయండి అని వేడుకున్నాడు.

అందుకు దత్తాత్రేయుల వారు "నాయనా! చాంచల్యం అనేది మనసు తీసే పరుగుల వల్ల కలుగుతుంది. మనసును అరికడితే అన్నీ చక్కబడతాయి. మనసుకు మూలమైన ప్రాణాన్ని నియంత్రించాలి. దానికి ప్రాణాయామం, చక్కని మార్గం. గురువు ముఖతః, ప్రాణాయామం విని, అభ్యసించి సాధన చేయాలి. నీలోపల ప్రజ్వరిల్లుతున్న ఆశాంతికి ఇదే మార్గం" అని తెలిపారు.

కార్తవీర్యార్జునుడు ఆయన ఆదేశాన్ని పాటించి ధ్యానం, ప్రాణాయామం చేస్తూ గొప్ప యోగిగా మారాడు.

అలాగే మనకు కూడా ఎన్ని సిరిసంపదలున్నా, ఆప్తుల మధ్యలోవున్నా, ఒక్కొక్కసారి ఏదో అశాంతిగా, ఆ అశాంతికి కారణం తెలియక కొట్టుమిట్టాడుతూ ఉంటాము. దీనికి ఈ కార్తవీర్జునుని కథ ద్వారా మూలం దొరికింది కదా! ఇక సాధనే తరువాయి.

# ప్రపంచమంతా గురుమయం

'బాలా దపి సుభాషితమ్' - మంచి మాట పసిబిడ్డ దగ్గరనుంచైనా సరే నేర్చుకోవాలని శాస్త్రాలు చెబుతాయి. ప్రపంచంలోని ప్రతి అణువునుంచీ మనం ఏదో ఒకటి నేర్చుకోవాలి. అందుకే "ప్రపంచమంతా గురుమయం" అన్నారు శ్రీదత్త ప్రభువు. ఎటొచ్చీ వాటి నుంచి గ్రహించే స్వభావం మనం అలవరచుకోవాలి.

ఈ ప్రపంచంలోకి వచ్చేటప్పుడు గుప్పిళ్లు మూసుకుని దేవుడిచ్చిన భుక్తం తెచ్చుకుంటాం. అది మొత్తం ఖర్చుకాగానే నేనేమీ తీసుకెళ్లడం లేదని చేతులు తెరచి చూపిస్తూ చనిపోతాం. ఎన్నికోట్లకు అధిపతి అయినా పూచికపుల్ల వెంట తీసుకుపోలేడని అందరికీ తెలిసిన విషయమే అయినా తెలియనట్టు నటిస్తూ దాని గురించి ఆలోచించడానికి తీరిక లేనట్టు ప్రవర్తిస్తాము.

ఆది గురువులు శ్రీదత్తాత్రేయులు "నాకు ఈ ప్రపంచమంతా గురుమయమే! అని" చెప్పారు.

పంచ భూతాలు మొదటి గురువులు, అందులో మొట్ట మొదటి స్థానం భూమిది.

భూమి సహనానికి మారుపేరు. తనపై మలమూత్రాలు విసర్జించినా, ఖాండ్రించి వుమ్మేసినా, ఎంతభారం వేసినా, పంటలకోసం నిధినిక్షేపాలకోసం, గునపాలతో, తవ్వి హింసించినా భరించడమేకాక, అనేక లోహాలు, వజ్రాలతో బాటు, పంటలు పండించి, ఆహారమిచ్చి జనులను కాపాడుతుంది. అలాగే మనిషి కుడా తన నెవరెంత విసిగించినా, బాధించినా వారికి కీడు తలపెట్టకుండా, క్షమించేగుణం అలవాటు చేసుకుంటే ప్రపంచంలో గొడవలే వుండవు. ఎదుటి మనిషిలో తప్పకుండా మార్పు తీసుకురాగలుగుతాడు. ఇలా భూమిలోని క్షమాగుణమే ప్రథమ గురువు.

రెండవ గురువు వాయువు. గాలి సుగంధ భరితమైన పువ్వుల మీదనుంచీ, దుర్గంధపూరితమైన మురుగు, మలినాల మీదనుంచీ సమానంగా ప్రసరించి, సువాసనలనూ, దుర్వాసనలనూ కూడా మోసుకొస్తుంది. కానీ కాసేపటిలోనే

వాటిని విసర్జించి, తన స్వభావ సిద్ధమైన స్వచ్ఛమైన గాలిని ప్రసరిస్తుంది. మనిషికూడా మంచీ చెడులతో కలిసి మెలిసి వుంటూ, కష్టసుఖాలు పంచుకుంటూ వుంటూనే, వేటినీ మనసుకి పట్టించు కోకుండా, తామరాకుమీద నీటిబొట్టులా నిర్లిప్తంగా వుండాలి. తోలు తిత్తిలాంటి ఈ శరీరంలో గాలినిండి వున్నంతవరకే జీవం. అది బయటికి రాగానే నిర్జీవమవుతుందని, గాలిబుడగలాంటిది జీవితమనే జ్ఞానాన్ని పొంది, సహజ సిద్ధమైన స్వభావాన్ని పోగొట్టుకోకుండా జీవించాలని వాయువు ద్వారా నేర్చుకోవాలి.

మూడవ గురువు ఆకాశం. ఆకాశానికి రంగూ, రూపం వుండవు. చూసేవారికి చంద్రుడూ, సూర్యుడూ, నక్షత్రాలు ఆకాశంలో వున్నట్టు నీలిరంగులో కనపడుతుంది. కానీ ఆకాశంలో ఇవేవీలేవు. అంతా శూన్యం. మనం కూడా ఎంతో మందితో సంచరిస్తూన్నట్టున్నా, అందరి సమస్యలూ, విషయాలు పట్టించుకున్నట్టు కనిపిస్తున్నా, లోపలికి ఏది తీసుకోకూడదు. మనసు శూన్యంగా వుంచుకోవాలి. ఆశూన్యంలోనే భగవంతుడిని చూడగలుగుతాం. ఎంత ఎత్తు ఎదిగినా, ఇంకా ఎదగాలనీ, ఎదిగీ, ఎదిగీ ప్రపంచమంతా మిథ్యఅనీ, శూన్యమనీ, భగవంతుడొకడే నిత్యమనీ తెలిపే గురువు ఆకాశం.

నాల్గవ గురువు నీరు. నీటికి కూడా రంగూ, రూపూ వుండవు. తనను ఏ పాత్రలో పోస్తే, ఆ ఆకృతిని దాలుస్తుంది. అంతేకాదు శరీరంలోని దోషాలను తొలగించే శక్తి నీటికి వుంది. అందరి స్వభావాలతో మిళితమవుతూ, వారిలోని దోషాలను సరిచేసి, స్వచ్ఛతను ఆపాదించడానికి ప్రయత్నం చేయాలని తెలిపే గురువు నీరు.

ఐదవ గురువు అగ్ని. తాను తాకిన ప్రతిదానికీ పవిత్రత ఆపాదిస్తుంది అగ్ని. మంచీ చెడూ అన్న విచక్షణ లేకుండా అన్నింటినీ దహించి, ఆహారంగా స్వీకరిస్తుంది. తాను మాత్రం పవిత్రంగానే వుంటుంది. మనిషి కూడా తన జ్ఞానం ద్వారా ఇతరులను పవిత్రులుగా చేయాలి. మనలోని 'అహంకారం' మనే చెడుని దహించకపోతే, చివరికి మిగిలేది బూడిదేనని తెలిపే గురువు అగ్ని.

ఇలా పంచభూతాలై మనకు గురువులుగా భావించి, మంచిని గ్రహించి మన వ్యక్తిత్వాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకోవాలి.

# భగవంతునిపై విశ్వాసము

నమ్మకము లేదా విశ్వాసము అనేది చాలా గొప్పమాట నమ్మకమనేది వుంటే ఆవగింజ కూడా ఒక కొండను పక్కకు జరుపగలదు. అంటే దానికి తనశక్తి మీద నమ్మకముంది. అటువంటిది ఇంతటి శక్తియుక్తులు కలిగిన మనిషి సాధించలేనిది ఏదీలేదు. కాకపోతే ముందు తనమీద తనకి నమ్మకముండాలి. అపుడే ఎంతటి పనైనా సాధించగలడు. అందునా భగవంతుడి మీద నమ్మకముంచిన వారికి అసాధ్యమనేది ఉండదు.

నిండు సభలో వస్త్రాపహరణమప్పుడు, ద్రౌపది శ్రీ కృష్ణుడి మీద అపారమైన నమ్మకముతో శరణువేడగనే, ఆవిడను అవమానం నుండి రక్షించాడు భగవానుడు. ఈ విశ్వాసము అనేది సంపూర్ణముగా ఉండాలి. ఏమాత్రము అనుమాన బీజం మనసులో దూరినా, ఫలితం శూన్యం. అందుకే "డౌట్ ఈజ్ డెత్" అన్నారు. నేను ఈ పని చేయగలను అని మనమీద మనకు విశ్వాసముంటే విజయము తథ్యము.

ఇందుకు వుదాహరణగా ఒక చిన్న కథ. ఒక పాలమ్మి ప్రతిరోజూ, పడవ మీద ఏరుదాటి శివాలయంలోని శివుడి అభిషేకానికి పాలు తీసుకువస్తూ వుండేది. ఒకటి, రెండు రోజులు పాలు తేవడం ఆలస్యమయింది. గుడి పూజారి "అభిషేకానికి ఆలస్యమయిపోతోంది పాలు తొందరగా తీసుకురా, లేకపోతే వేరే వాళ్లని పెట్టుకుంటాను" అంటూ ఆమెను బెదిరించాడు. అందుకు పాలమ్మి "ఏరుదాటి రావడానికి పడవమీద వస్తాను. పడవ నిండే జనం వస్తేగానీ పడవ నడపనంటున్నాడు, పడవాయన ఏంచేయాలి సామీ! నాకు మాత్రం శివయ్య అభిషేకానికి ఆలస్యం చెయ్యాలని ఎందుకుంటుంది. కొంచెం ఓర్చుకోండయ్యా!" అని పూజారిని బతిమిలాడింది.

అందుకు పూజారి "ఏరు దాటడానికి పడవెందుకు "ఓం నమః శివాయ అనుకుంటూ ఏరుమీద నడిచి వచ్చేయి" అన్నాడు ఎకసెక్కంగా.

మరునాడు పాలమ్మి సమయానికి పాలు తెచ్చింది ఏమిటీ? ఇవాళ తొందరగా తెచ్చావు, పడవ తొందరగా వేశాడా? అని అడిగాడు పూజారి.

లేదయ్యా! తమరు చెప్పారుగా అని "ఓం నమః శివాయ" అనుకుంటూ ఏరుమీద నడిచొచ్చానయ్యా అంది. "నాతోనే పరాచికాలాడుతున్నావా?" అని కోపంగా అడిగాడు పూజారి. "లేదయ్యా నిజం ఏరు మీద నడిచొచ్చాను. చూడండి నాబట్టలన్నీ తడిసున్నాయి. అంటూ ప్రమాణం చేసింది పాలమ్మి.

శివుడికి అభిషేకంకాగానే, పూజారి "ఏదీ ఇప్పుడు నేను చూస్తాను ఏరు మీంచి నడిచివెళ్లు. ఇన్నేళ్లుగా స్వామిని అర్చించుకుంటున్న నాకే చేతకాలేదు" అని పాలమ్మి వెంట ఏరు దగ్గరికి వెళ్ళాడు.

ఎంతో విశ్వాసంతో పాలమ్మి "అట్టాగే స్వామీ! మీరు కూడా రండి పోదాం" అని "ఓం నమః శివాయ" అనుకుంటూ ఏటిలోకి దిగింది. చిత్రంగా మునిగి పోకుండా ఆవలి ఒడ్డుకు వెళ్ళింది. నిత్యమూ శివుడిని అభిషేకించే పూజారి మాత్రం ఏరుదాటలేక నీళ్లు నములుతూ చూస్తూండి పోయాడు.

భగవంతుడిని నిత్యమూ పూజిస్తున్నా, అతని మీద విశ్వాసము లేదు పూజారికి. సంపూర్ణమైన నమ్మకముంది పాలమ్మికి. కాబట్టే ఆమె ఆవలి తీరానికి చేరుకుంది. ఈ రకమైన భగవంతునిపై సంపూర్ణ విశ్వాసమే మనలను సంసార బంధాలనుంచి విముక్తులను చేసి, ఆవలితీరం అంటే మోక్షమార్గానికి చేర్చగలదు.

అలాగే నమ్మకము మీద ఒక చిన్న సంఘటన మనందరికీ విదితమే!

ఒకతను అతిసార వ్యాధితో బాధపడుతున్నానని డాక్టరు దగ్గరకు వెళ్ళాడు. డాక్టరు ఒక కాగితం మీద మందుపేరు రాసి ఇది మూడుపూటలా వేసుకుని "రేపొచ్చి చెప్పు ఎలావుందో" అని కాగితం అతనికి ఇచ్చాడు. మరునాడు అతను చాలా సంతోషంగా వచ్చాడు. డాక్టరుగారికి నమస్కరించి "అయ్యా! నాకు తగ్గిపోయింది చాలా హాయిగా వుందని చెప్పాడు. డాక్టరు "ఏదీ ఆచీటీ ఇవ్వు బలానికి మందు రాసిస్తాను అన్నాడు. చీటీ ఎక్కడిదయ్యా? మూడు ముక్కలు చేసి మూడు పూట్లా పుచ్చుకున్నానుకదయ్యా" అన్నాడు అమాయకంగా. అవాక్కవడం డాక్టరువంతయింది.

ఇక్కడ మనం గమనించవలసిందేమంటే డాక్టరు ఇచ్చే మందుకన్నా, అతనిమీద నమ్మకమే అతనిని రోగవిముక్తుడిని చేసింది. "వైద్యోనారాయణోహరి" అన్నారు కదా! నమ్మకానికి అంత బలముంది మరి.

గౌతమ బుద్ధుడంటారు "నమ్మకమనేది మనిషికి ఒక వరం. దీని వలన మనసులోని కల్మషం హరించి, స్నేహపూరితంగా మారుస్తుంది, జ్ఞానం వైపు పయనింపచేస్తుంది" అని

లార్ట్ మహవీర అంటారు "నిజమైన నమ్మకమే నిజమైన జ్ఞానము అదే నిజమయిన ప్రవర్తనకు దారి చూపిస్తుందని.

ఋగ్వేదంలో వచించినట్లుగా "ఓ విశ్వాసమా! మాలో విశ్వాసాన్ని పెంపొందించు" అని మనందరం ప్రతి నిత్యం భగవంతుడిని ప్రార్థించాలి.

"శ్రద్ధావాన్ లభతే జ్ఞానం" అన్నారు శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీతలో ఎవరికైతే శ్రద్ధ (నమ్మకము) వుంటుందో, వారికి జ్ఞానం లభిస్తుంది. ~~ఈ~~ జ్ఞానం ద్వారా భగవంతుని చేరే మార్గం తెలుసుకోగలుగుతాము. అందుకే భగవంతుడిపై సంపూర్ణ నమ్మకముంచాలి. నమ్మకమే దేవుడు.

# నిత్య సంతోషం

భగవంతుడు మనిషికి వివేకం ఇచ్చాడు. దాన్ని ఉపయోగించి, జీవితం అశాశ్వతమనీ, శాశ్వత ఆనందం పొందడానికి దేవుడిచ్చిన దానితో సంతృప్తిచెంది, నిత్యసంతోషంగా వుండటం అలవాటు చేసుకోవాలి.

చంద్రుడు శుక్లపక్షంలో దినదినాభివృద్ధి చెందుతూ, బహుళ పక్షంలో క్రమంగా క్షీణించి అమావాస్య నాటికి అసలు రూపసదృశం కాకుండా వుంటాడు. చంద్రుడు శీతల హృదయుడు. తనని చూడగానే ఆహ్లాదంగా వుంటుంది. ఇదేరీతిగా మన జీవితాల్లో అనేక ఒడిదుడుకులు, ఆటుపోట్లు సుఖ దుఃఖాలు వస్తుంటాయి. ఇవన్నీ కూడా శాశ్వతం కాదనీ, దుఖం వెంట సుఖము, సుఖము వెంట దుఃఖమూ వుంటాయని, కష్టాలు రాగానే కృంగి పోకుండా పాడ్యమినాటి చంద్రుడు ఎలా దినదినాభివృద్ధి చెందుతాడో, కష్టాల వెంబడే సుఖం వస్తుందని ఆశాభావంతో జీవించాలి అన్ని వేళలా అంటే కష్ట సుఖాల్లో సమభావం కలిగి, చంద్రుడిలాగే చల్లగా, ఆహ్లాదకరంగా వుండటం అలవాటు చేసుకోవాలి.

సూర్యభగవానుడు కర్మసాక్షి. సూర్యుడు ఒకడే అయినా అనేక జలపాత్రలలో అనేకమంది సూర్యులలాగే కనిపిస్తాడు. అలాగే ఆత్మ ఒకటే కానీ సమస్త, జీవరాశులలో వివిధంగా ఉన్నట్టు కనిపిస్తుంది. అలాగే సూర్యుడు భూమి మీద నీటిని గ్రహించి తిరిగి భూమికే వర్షరూపంలో అందించి పాడిపంటలు అభివృద్ధికి దోహదపడతాడు. దీనినుంచి మనం ఇంద్రియాల ద్వారా గ్రహించిన వాటిని, తిరిగి వదిలివేయాలేకానీ, లోపలే స్థిరంగా ఉంచుకుని జీవితం నాశనం చేసుకోకూడదని గ్రహించాలి.

సముద్రం లోతు అగమ్యం. చాలా గంభీరంగా వుంటుంది. హద్దులు మీరి పొంగదు. దీని గర్భంలో అనంత సంపద దాగి వుంటుంది. అందుకే సముద్రాన్ని రత్నగర్భ అంటాము. దీని నుంచి మనం నేర్చుకోవలసినది చాలా వుంది. ఎన్ని సిరిసంపదలున్నా జ్ఞానసంపదవున్నా, సముద్రంలా హద్దులు మీరి ప్రవర్తించక సంయమనంతో, గంభీరంగా వుండాలి. సముద్రంలో ఏదైనా వస్తువుగానీ, జీవిగానీ పడితే, అది వాటిని బయటికి నెట్టివేస్తుంది. అలాగే

మనలోకి ప్రవేశిస్తున్న విషయవాసనలు ఎప్పటికప్పుడు బయటికి వదిలివేసి ప్రశాంతచిత్తంతో ఉండాలి.

కామాన్ని జయించినవారు కూడా నాలుకకు లొంగిపోవడం చూస్తూంటాం. అన్నీ వదిలేశాము. కాస్త జిహ్వ చాపల్యమే కదా అనుకుంటారు. చేప జలచరం. జిహ్వ మీద కోరికతో, జాలరి గాలం చివర మాంసం ముక్క పెట్టి నీళ్ళలోకి వదలగానే, వచ్చి గాలానికి చిక్కి చచ్చిపోతుంది. కాబట్టి జిహ్వచాపల్యానికి బానిస కాకుండా, చేపలాగా గాలానికి చిక్కి, పతనమవకుండా జాగ్రత్త పడాలి.

పసిపాప నిత్య సంతుష్టి ఎవరైనా తనని ముద్దాడినా, ఆడుకున్నా బోసి నవ్వులు కురిపిస్తూ హాయిగా సంతోషంగా వుంటుంది. తనకి ఎవరూ శత్రువులుండరు. అలాగే మానావమానాలు కూడా వుండవు.

అలాగే మనం కూడా రాగద్వేషాలకూ, సన్మాన అవమానాలకు అతీతులుగా వుండి, నిష్కల్మషంగా, నిత్యమూ సంతోషంగా వుండటం నేర్చుకోవాలి.

# న్యాయబద్ధ సంపాదన

న్యాయంగా సంపాదించిన ధనంతో పిడికెడు అన్నము తిన్నా అది అమృతంతో సమానము. అసత్యము, మోసము, అవిశ్వాసము ద్వారా సంపాదించిన ధనంతో పంచభక్ష్యపరమాన్నాలు లభించినా, స్వయంగా న్యాయబద్ధమైన రీతిలో లభించిన దానంత తృప్తి నివ్వలేదు. అయితే ఇది అన్ని వేళలా వీలుకాకపోవచ్చు. అనారోగ్యము, ఆపదలు కలిగినప్పుడు తప్ప, భార్యాపిల్లలు, శిష్యులు, పనివారు మొదలైనవారు వున్నప్పటికీ, తనకు ఎంత వీలయితే అంత స్వయంగా పనిచేసుకోవడం, సంపాదించుకోవడం అలవాటు చేసుకోవాలి. దానివలన ఇతరులపై ఆధారపడాల్సిన అవసరం వుండదు. దీనితోపాటు సమయం అమూల్యమని తెలుసుకుని, ప్రతి సమయంలో భగవంతుని స్మరించుకుంటూ, మన పనులనే కాక, వీలున్నంతలో పరోపకార పనులు కూడా చేయడం వలన ఆత్మ తృప్తి కూడా కలుగుతుంది.

చాలామంది అన్నిరకాల పనులకు, నౌకర్లని నియమించుకుని, కాలుమీద కాలువేసుకుని సొంతంగా పనులు చేసుకునేవారిని కించపరచి మాట్లాడడం చేస్తూ గొప్పలకి పోతూవుంటారు. నిజానికి, వారిని వారే కించపరచుకుంటున్నారని వారికి తెలియదు. అటువంటి వారితో స్నేహం చేయడం వలన మనస్తాపంతో, అందరూ దూరంగా జరుగుతారు. వారు ఒంటరిగా మిగులుతారు. వారి గొప్పే వారికి మిగులుతుంది.

న్యాయబద్ధ సంపాదన యొక్క ప్రభావము లేదా శక్తి ఎంత గొప్పదో తెలుసుకునేందుకు ఉదాహరణగా చక్వేణుడు అనే రాజు గురించి తెలుసుకుందాము. చక్వేణుడు చాలా సద్గుణసంపన్నుడు, ధర్మాత్ముడు, త్యాగి, సత్యవాది. అతడు ప్రజలనుండి తీసుకోబడే పన్ను అంతటినీ ప్రజల సేవలో వినియోగించేవాడు. ప్రజలపై అతని ప్రభావము చాలా వుండేది. అతని పాలనలో ప్రజలు అన్నివిధాల సుఖంగా ఉండేవారు.

రాజు తన భార్యాపిల్లల పోషణార్థం స్వయంగా వ్యవసాయం చేసేవాడు. పొలంలో పండిన ధాన్యం, కూరలు పండ్లు మాత్రమే భోజనంలో వినియోగించేవారు. ఆరుగంటలు నిద్రను విడిచి, ఆ రాజు మిగిలిన

సమయమంతా భగవత్ భక్తి, పరోపకారము, రాజ్యకార్యము, వ్యవసాయానికి చెందిన పనులలో గడిపేవారు. తనకు చెందిన పనులు సేవకుల చేతకాక, తానే స్వయంగా చేసుకునేవాడు. రాణీగారు కూడా భర్తకు చేదోడు వాదోడుగా వుంటూ నిరాడంబరంగా వుండేది. రాణీలు ధరించే దుస్తులకు నగలకు దూరంగా వుండేది. ఎందుకంటే, వ్యవసాయం మీద వచ్చే ద్రవ్యముతో అవన్నీ సాధ్యపడవు కనుక.

ప్రతిరోజూ రాజును, రాణిని చూడడానికి ప్రజలు వస్తూవుండేవారు. ఒకసారి ఆ రాజ్యంలో పెద్ద ఉత్సవం ఒకటి జరిగింది. దానిని చూడడానికి వేరే నగరాలనుంచీ కూడా పెద్ద సంఖ్యలో జనం వచ్చారు. వాళ్ళలో కొంతమంది ధనికస్త్రీలు, ధగధగలాడే నగలతో, పట్టువస్త్రాలు ధరించి దాసీజనం వెంటరాగా, రాణిగారి దర్శనార్థం వచ్చారు. ఆమెను చూసి ఆశ్చర్యపోయి, "రాణీగారూ! మీ వస్త్రాల్లాంటివి మా కూలివాళ్ళుకూడా ధరించరు. మేమందరం మీకు దాసీజనంలాంటి వాళ్ళము. మేమే ఇలావున్నప్పుడు, మీరు మమ్మల్ని మించిన వస్త్రధారణతో, నగలతో అలంకరించుకుని మా కనులకింపుగా ధగధగమెరిసిపోతూ ఉండాలి. మా రాణీగారయిన మిమ్మల్ని ఇంత నిరాడంబరముగా చూస్తున్న మాకు చాలా బాధగా ఉంది. ఒక మహారాజు యొక్క మహారాణికి తగిన వస్త్రభూషణాలతో మిమ్మల్ని చూడాలను కుంటున్నాము, అంటూ వాళ్ళు వెళ్ళిపోయారు. వారిమాటలకు రాణీగారి మనస్సు కొంచెం చలించింది. మహారాజుతో ఈ సంఘటనంతా చెప్పి, తాను ధరించడానికి విలువైన వస్త్రాలను, నగలను తెప్పించమని కోరింది. రాజుగారు, రాణి కోరికను కాదనలేక, రాజ్యం యొక్క ద్రవ్యము ఇందు నిమిత్తం వాడలేక, మధనపడి, ఆలోచించి, తాను మహారాజు కనుక దుష్టులు, బలవంతులు అయిన రాజులనుండి పన్ను తీసుకోవచ్చు అనుకున్నాడు. తరువాత మంత్రిని పిలిచి "మీరు రాక్షసరాజు రావణుని దగ్గరకు వెళ్ళి పన్ను కింద మణుగు బంగారాన్ని చెల్లించమని చెప్పి తీసుకురమ్మని పంపాడు. మహారాజు ఆజ్ఞమేరకు రావణుని సభకు చేరి చక్రవేణు మహారాజు సందేశాన్ని వినిపించాడు. అంతట రావణాసురుడు "నాలాంటి బలవంతుడిని సర్వస్వతంత్రుడిని "పన్ను" కట్టమంటాడా మీ రాజు? ముందర నిన్ను బంధించివేస్తాను. మీ రాజు సంగతి తరువాత చూస్తాను" అన్నాడు. కానీ సభలోని వారంతా దూతను

బంధించకూడదని నచ్చచెప్పడంతో అతడిని విడిచిపెట్టాడు. తరువాత ఈ విషయాన్ని అంతఃపురంలోకి వెళ్లినపుడు భార్య మండోదరితో చెప్పాడు. వినగానే "స్వామీ! చక్ర్వవేణుమహారాజు గురించి నేను విన్నాను. అతడు ధర్మాత్ముడు, సత్యవాది, త్యాగశీలి. అటువంటి రాజు యొక్క దూతను అవమానించి పంపడం వలన మనకు కీడు వాటిల్లవచ్చు. ఆ రాజు యొక్క ప్రభావము రేపు మీకు చూపిస్తాను." అని చెప్పి మరునాడు రావణుడిని, భవన పైభాగానికి తీసుకువెళ్లింది. ప్రతిరోజు పక్షులకు దానిమ్మ గింజలు వేస్తూ వుంటుంది మండోదరి. గింజలు వేస్తూ పక్షులతో "ప్రభువు రావణుని ఆజ్ఞ ఇది. గింజలను తినవద్దు" అన్నది. కానీ పావురాలు గింజలను తింటూనే వున్నాయి. రావణుడు మూర్ఖులైన పక్షులకేమి తెలుస్తుంది. నీవు చెప్పింది" అన్నాడు. మండోదరి "ఇప్పుడు మీరు రాజు చక్ర్వవేణుని ప్రభావాన్ని చూడండి అని పక్షులతో" జాగ్రత్త చక్రవేణుని ఆజ్ఞ ఇది గింజలను తినవద్దు." అన్నది. వెంటనే అవి గింజలను తినడం మానివేసాయి. తరువాత ఆమె "ఇది చక్రవేణుని ఆజ్ఞ ఇపుడు గింజలను తినండి" అనగానే పక్షులు గింజలను తినడం మొదలుపెట్టాయి. అప్పుడు మండోదరి రావణునితో ఈ పక్షులపైన మీ ప్రభావము ఏమీలేదు. కాని చక్ర్వవేణుడు ఎదుటలేకున్నా, అతని ప్రభావం వాటిమీద ఉన్నది. రావణుడు ఆశ్చర్యపోయి మండోదరి మాటలను ఆలోచించడం మొదలుపెట్టాడు.

కొంత తడువుకి వెళ్లిపోయాడనుకున్న చక్ర్వవేణుని మంత్రి మరలావచ్చి "రాజా! మీరు మణుగు బంగారం పన్నురూపంలో ఇవ్వకపోతే, మాకు మీతో యుద్ధము చేయవలసిన అవసరం వుంటుంది. మారాజు ప్రభావము యొక్క చక్రము నడుస్తుంది. లంక క్షణంలో నాశనమయి పోతుంది. పన్ను రూపంలో మణుగు బంగారము చెల్లించి లంకను రక్షించుకోండి. ఇది తప్ప వేరే మార్గము లేదు" అంటూ అనునయంగా చెప్పాడు. మంత్రి ధైర్యంగా తిరిగివచ్చి తనని పరోక్షంగా బెదిరించడమూ, భార్య మండోదరి మాటలు గుర్తుచేసుకుని, ఆలోచన చేసి మణుగు బంగారం, పన్ను రూపంలో చెల్లించాడు రావణుడు. అది తీసుకుని చక్ర్వవేణుని మహారాజు దగ్గరకు వెళ్ళి బంగారాన్ని ఎలా తెచ్చావు అని అడిగాడు. జరిగిన విషయం మంత్రి రాజూ రాణీలకు వివరించాడు. రాణి ఆశ్చర్యంతో ఇది ఎలా సంభవం అని రాజుని అడిగింది. అపుడు రాజు "మనము ఎవరిమీద ఆధారపడక, శ్రమతో జీవనం సాగిస్తూ, త్యాగ బుద్ధితో,

నిష్కామభావంతో జీవిస్తున్నాము. దాని ప్రభావమే ఇది" అన్నాడు. దీనిని వినగానే రాణి మనసు మారి, "స్వామీ! కొంత మంది ధనికస్త్రీల బోధనలవలన నాకు కొంత బుద్ధి చాంచల్యము కలిగినది. వారి మాటల ప్రలోభములకు లొంగి, మిమ్మల్ని బాధించినందుకు క్షమించండి. ఇంతవరకు ఎలా సంయమనంతో వుంటూ వచ్చానో ఇకమీదట కూడా అలాగే ఉంటాను. నా తప్పును క్షమించి ఈ బంగారాన్ని తిరిగి ఇచ్చివేయండి" అన్నది. రాజు మంత్రితో ఈ బంగారం మనకవసరంలేదు. ఎక్కడినుంచి తెచ్చావో అక్కడే తిరిగి ఇవ్వు" రాణిగారికి దీని అవసరం, ఈశ్వరుని కృపవలన దూరమయింది అని చెప్పాడు.

దీనిని బట్టి కొద్దిసేపటి చెడు సహవాసమయినా ఎంత హానికరమో తెలుస్తుంది. వీటి నుంచి దూరముగా వుండటం మంచిది. అలాగే నిష్కామభావంతో న్యాయబద్ధంగా, సత్యపూర్వకంగా జీవితాన్ని గడిపిన చక్రవేణు మహారాజు ప్రభావాన్ని చదివాము.

ఇతరులపై ఆధారపడకుండా సత్యపూర్వకంగా సంపాదించినది అనుభవించడం వలన ఎంతో మనశ్శాంతి, ఆరోగ్యమూ లభిస్తాయి. న్యాయబద్ధంగా సంపాదించిన పిడికెడు అన్నమయినా అది అమృతముతో సమానము. కాబట్టి ఈ రీతిగా మన జీవనము సాగిస్తే, ప్రశాంతమైన జీవితం మన సొంతమవుతుంది.

శ్రమైక జీవనమే ఆనందం

శ్రమయే శక్తి.

# సారూప్య భక్తి

మన ధ్యాస అంతా పరమాత్ముడివైపు లయం చేసి మనసుకు మార్గోపదేశం చేసి ఎటూ చెదరకుండా బంధించి పెడితే అది నిరంతరం భగవంతుడి మీద ధ్యాస పెట్టి పూర్తిగా అతడితో సారుప్యం పొందుతుంది. తుమ్మెద ఒక పురుగును పట్టుకొచ్చి తన గూటిలో వుంచుతుంది. తరువాత దానిని గట్టిగా ఒకసారి కుట్టి ఆ గూటిద్వారం మట్టితో మూసి దాని చుట్టూ తిరుగుతూ ఝుంకారం చేస్తుంది. ఆ నాదం విని లోపల పురుగు మళ్లీ తుమ్మెదవచ్చి కుడుతుందేమో అన్న భయంతో దానిగురించే ఆలోచిస్తూ దానిగొంతు వింటూ రూపం ధ్యానిస్తూ, కొన్ని రోజులకి అది కూడా తుమ్మెదగా మారిపోతుంది. ఎలాగైతే పురుగు తన ధ్యాసంతా తుమ్మెదమీద పెట్టి దానిలాగే మారిపోయిందో, మన మనసుని భగవంతుని చేరే మార్గం వైపుకు మళ్ళించాలి.

ఈ సృష్టి సర్వస్వం పరమాత్ముడికి ఒక లీల. సృష్టించేదీ ఆయనే, లయం చేసేది ఆయనే. ఐతే మనిషి ఈ ఇళ్లూ, వాకిళ్లు, సంపదలు అన్నీ తనవే అనుకుంటాడు. పొంగిపోతుంటాడు. ఈ సృష్టి యావత్తు పరామాత్మలో నుంచి వచ్చినదే. ఆయన తన ఆట పూర్తి కాగానే ప్రళయం సృష్టించి తనలో లయం చేసుకుంటాడు. అది తెలిసి కూడా మనం ఒక్కొక్కసారి ఈ విషయ వాసనల మాయా జాలంలోపడి అంతా మనగొప్పేనని అహంకరిస్తుంటాము. సాలెపురుగు నుంచి మనం నేర్చుకోలసినది వుంది. ఇది తన లోపలి నుంచి జిగురు పదార్థం తెప్పించి, దానితో దారాలు దారాలుగా గూడు నిర్మిస్తుంది. అలా ఆ గూటిలో సంచరిస్తూ ఉన్నట్టుండి ఆ దారాన్ని తిరిగి మింగేస్తుంది. ఇలా గూడు నిర్మించటం, అలా మింగేయటం దానికొక ఆట. సాలె పురుగు జీవన విధానం నుంచి, మనం నిమిత్తమాత్రులం అంతా భగవంతుడి లీల అని తెలుసుకుని తామరాకుమీద నీటిబొట్టులాగా జీవించాలి.

ఎంతో బలవంతురాలైన ఏనుగు నుంచి కూడా మనం నేర్చుకోవల్సింది ఉంది. ఏనుగును బంధించటం కోసం వేటగాడు ఒక పెద్ద గొయ్యి త్రవ్వి, దానిపైన చెత్తా చెదారం వేసి కప్పేసి, దానికి దగ్గరగా ఒక ఆడ ఏనుగు బొమ్మను నిలబెడతాడు. అది నిజమయినదనుకొని దాని మీద మోజుతో ఈ ఏనుగు

వెళ్ళి ఆ గోతిలో పడుతుంది. అలాగే మనిషి ఎంత జ్ఞానవంతుడైనా ప్రలోభాల చేతికి చిక్కి పతనమవకూడదు.

తేనెటీగ, పువ్వు పువ్వు మీద వాలి కష్టపడి చుక్క చుక్కగా తేనె పోగుచేసి ఎప్పటికో పనికివస్తుందని తేనెతుట్టెలో కూడబెడుతుంది. కానీ అది తినదు తాగదు. ఇంకా ఇంకా కూడబెట్టాలనే ధ్యాసే దానికి. కోయలు ఆతుట్టెకింద మంట పెట్టి తేనె టీగలను లేవకొట్టి తేనె కాస్తా పిండుకుపోతారు. మనిషి కూడా అదే పనిగా డబ్బు కూడబెట్టి తన మనవళ్లు, మునిమనవళ్లకోసం దాచిపెడతాడు. తాననుభవించక కూడబెట్టిన ధనం దొంగలపాలుకావడమో లేక ఇన్‌కమ్‌టాక్స్ రైడింగుల్లో పట్టుకుపోవడమో జరుగుతుంది. అంత కష్టపడి కూడబెట్టిన ధనం పరుల పాలయిందని దుఃఖించిన తరువాత జ్ఞానోదయం అవుతుంది. అందుచేత ధన సంచయం దుఃఖ హేతువని మనం ఈ తేనెటీగ ద్వారా నేర్చుకోవాలి.

ఒక కపోతం తన భార్యా బిడ్డలతో ఒక చెట్టుపైన నివసించేది. ఒకనాడు బిడ్డలకు ఆహారం తెద్దామని ఆలూమగలూ బయలు దేరి వెళ్ళాయి. ఇంతలో ఒక వేటగాడు ఆ చెట్టుకింద కొని నూకలు చల్లి వలపన్నాడు. చాలా పక్షులు వచ్చి ఆ వలలో పడ్డాయి. వాటికోలాహలం విని వచ్చిరాని రెక్కలతో ఆ కపోతం బిడ్డలుకూడా ఆ వలలో చిక్కుకున్నాయి. ఇంతలో బిడ్డలకు ఆహారం తెచ్చిన తల్లి బిడ్డలు వలలో వుండటం చూసి దుఃఖంతో వాటిని కౌగలించుకుంది. కొంత సేపటికి మగ కపోతం వచ్చి భార్యబిడ్డల దురవస్థ చూసి అందరూ పోయిన తరువాత తానుండి ప్రయోజనమేమిటని తానుకూడా వలలో దూకి బోయవాడి చేతికి చిక్కి మరణించింది. ఇది చూచి మనం నేర్చుకోవల్సింది చాలా వుంది. మనిషి బంధాలను కోరితెచ్చుకుంటాడు. అవే తరువాత దుఃఖహేతువులవుతాయి. జ్ఞానసంపన్నమైన మానవ జన్మ సంప్రాప్తించినా, వివేకాన్ని పోగొట్టుకొని మోహజాలంలో చిక్కుకుంటున్నారు. దీనికి తరుణోపాయం అతి స్నేహం, భవబంధాలు, అతిప్రేమలకు లోనుకాకుండా కర్తవ్య నిర్వహణకు ఎవరితో ఎంత సంబంధం ఉంచుకోవాలో అంతే ఉంచుకొని మనుగడ సాగించాలి. అప్పుడే భవ బంధ విముక్తులమై భగవంతునివైపు దృష్టి సారించగలుగుతాము.

# మానసిక పూజ

పూజ ప్రధానంగా రెండు రకాలు. ఒకటి మానసిక పూజ. రెండవది బహిరంగ పూజ. మన ఎదురుగా విగ్రహంతో నిమిత్తం లేకుండా, భావనతో భగవంతుని ధ్యానించుకునేది మానసిక పూజ. ఇష్టదైవ విగ్రహాన్ని ఎదురుగా ఉంచుకొని దాన్ని చూస్తూ పూజచేయటం బహిరంగ పూజ. మానసిక పూజకు సాధన, మనోబలం చాలా అవసరం. ఇది సాధించటానికి మొదటి మెట్టుగా బహిరంగ విగ్రహపూజ సహాయపడుతుంది. లేచినది మొదలు నిదురించే వరకు ప్రతిపనిలో భగవంతుని భావన చేసుకుంటూ తరించవచ్చు.

ఉదయం నిద్రలేస్తూనే

**కరాగ్రేవసతే లక్ష్మీ**
**కరమధ్యే సరస్వతీ**
**కరమూలే స్థితాగౌరీ**
**ప్రభాతే కరదర్శనం.**

అనే శ్లోకం పఠిస్తూ మన అరచేతిలోనే లక్ష్మి, సరస్వతి, గౌరీ రూపాలను భావించి రోజును ప్రారంభిస్తే రోజంతా ఎంతో మంగళకరంగా ఉంటుంది.

తదనంతరం నేలమీద కాలుమోపుతూ:

**"సముద్రవసనేదేవీ**
**పర్వతస్తన మండితే**
**విష్ణుపత్నీ నమస్తుభ్యం**
**పాదస్పర్శం క్షమస్వమే"**

అనే శ్లోకం పఠించటం ద్వారా భూదేవి మీద మన భారాన్నీ, పాదాన్నీ మోపుతున్నందుకు క్షమించమని ప్రార్థించటం వలన కృతజ్ఞతా భావాన్నీ, అలాగే క్షమించమని అడిగే గుణాన్ని అలవర్చుకుంటాము.

కాలకృత్యాల అనంతరం దేహశుద్ధి గావించుకుంటూ:

"గంగేచ యమునేచ
గోదావరి సరస్వతి
నర్మదే సింధుకావేరి
జలేస్మిన్ సన్నిధింకురు"

అని స్మరించుకుంటూ స్నానించటం వల్ల పైన తెలిపిన పుణ్యనదులలో స్నానమాచరించి తరించినట్లు భావించడం వలన, బాహ్యశుద్ధితోపాటు అంతర్ శుద్ధికూడా కలుగుతుంది.

తరువాత నుదుటన భస్మధారణ చేసుకుంటూ:

"శ్రీకరం పవిత్రంచ
శోకరోగ నివారణం
లోకేవశీకరం పుంసాం
భస్మం త్రైలోక్య పావనం"

అంటూ భస్మధారణ సమయంలో భగవంతుని ధ్యానించవచ్చు. భస్మధారణ గావించి తదనంతరం గ్రహాలను మనకు అనుగ్రహాలుగా మార్చుకునేందుకు నవ గ్రహాలలో ప్రప్రథముడూ, మనకు ప్రత్యక్షదైవం అయిన సూర్యభగవానుడికి నమస్కరిస్తూ

ఓం మిత్ర రవి సూర్య భాను ఖగ
పూష హిరణ గర్భ మరీచి ఆదిత్య సవితృ అర్కభాస్కరే భ్యో
అంటూ పఠించి ఆదిత్యుడినీ
ఆదిత్యాయచ సోమాయ
మంగళాయ బుధాయచ
గురుశుక్రశనిభ్యశ్చ
రాహవే కేతవే నమః

అనే శ్లోకం ద్వారా నవగ్రహాలను స్మరించుకుంటే ఈ నవగ్రహాలు మనకు అనుగ్రహాలుగా ఉంటాయి.

భోజనానికి కూర్చున్నప్పుడు శ్రీకృష్ణభగవానుడు గీతలో చెప్పిన శ్లోకం.

"అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః
ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్"

అని చదువుకుంటే వైశ్వానరుడనే జఠరాగ్ని రూపంలో మనలోని ప్రాణాపాన వాయువులతో కలిసి ఆహారం చక్కగా జీర్ణమవుతుంది.

భోజనానంతరం ఏదైన ఔషధం తీసుకోవాలంటే

**"శరీరే జర్జరీ భూతే**
**వ్యాధిగ్రస్తే కళేబరే**
**ఔషధం జాహ్నవీతోయం**
**వైద్యోనారాయణో హరిః**

అనే శ్లోకం పఠిస్తూ మందు వేసుకుంటే ఆ మందు చక్కగా పనిచేసి స్వస్థత చేకూరుతుంది. సాయం సంధ్యలో దీపం వెలిగిస్తున్నప్పుడు

**"దీపం జ్యోతి పరబ్రహ్మం**
**దీపం సర్వతమోపహం**
**దీపేన సాధ్యతే సర్వం**
**సంధ్యాదీపా నమోస్తుతే"**

అనే శ్లోకం పఠిస్తూ ఈ దీపం పరబ్రహ్మ స్వరూపమని, చీకట్లను పారద్రోలి మనలో జ్ఞానదీపాన్ని వెలిగిస్తున్నట్లు భావించి నమస్కరించుకోవచ్చు. తరువాత నిదురించే సమయంలో

**"రామం స్కంధం హనూమంతం**
**వైనతేయం వృకోదరం**
**శయనేయ స్మరణే నిత్యం**
**దుస్వప్నం తస్యనస్యతే"**

అని పఠిస్తే చెడు కలలు రాకుండా హాయిగా నిద్రపడుతుంది. మనం గాఢ నిద్రలో ఉన్నప్పుడు దొంగల భయం లేకుండా ఉండటానికి

**"కార్తా వీర్యార్జునో నామ**
**ఆజానుబాహు సహస్రనాన్**
**తస్య స్మరణ మాత్రేణ**
**చోరబాధా నివర్తతే"**

అని పడుకునే ముందు చదువుకుని పడుకుంటే కార్తవీర్యార్జునుడు దొంగల బారి నుండి మనల్ని కాపాడుతాడనే మానసిక భద్రత వలన చక్కటి నిద్ర మన సొంతం అవుతుంది. ఇలా ఉదయం నుంచి రాత్రి వరకు మనం చేసే ప్రతి పనిలో భగవంతుని స్మరించుకుంటూ మానసిక పూజ చేసుకొని తరించవచ్చు.

ఇంకొంచెం ఓపిక తెచ్చుకొని

**"అదౌ రామ తపోవనాది గమనం**
**హత్వామృగం కాంచనమ్**
**వైదేహీ హరణం జటాయు మరణం**
**సుగ్రీవ సంభాషణమ్**
**వాలీ నిగ్రహణమ్ సముద్ర తరణం**
**లంకా పురీ దాహనమ్**
**పశ్చాత్ రావణ కుంభకర్ణ హననం**
**త్వేతద్ధిరామాయణమ్**

**అని సంక్షిప్త రామాయణాన్నీ,**

**అదౌ దేవకీ దేవ గర్భజననమ్**
**గోపీ గృహే వర్ధనం**
**మాయా పూతన జీవితాపహరణం**
**గోవర్ధనోద్ధారణమ్**
**కంస చ్ఛేదన కౌరవాది హననమ్**
**కుంతీ సుతాం పాలనమ్**
**హేతద్భాగవతం పురాణకథితం"**

అని సంక్షిప్త భాగవతాన్ని పఠిస్తే రామాయణాన్నీ, భాగవాతాన్నీ చదివిన పుణ్యఫలం పొందగలుగుతాము. ఇలా ప్రతి పనిలో భగవంతుని ఉనికిని ప్రస్తుతిస్తూ మానసికంగా ఆయనకి దగ్గరవుతాము. మనసు ఎల్లప్పుడు ఆయన రక్షణలో ఉన్నట్లు భావన కలిగి తనువూ మనసూ ఎంతో ప్రశాంతంగా ఉంటుంది.

# సుఖ శాంతులు

మనిషి ఈ ప్రపంచంలోకి రావడానికి భగవంతుని కృప వుంటేనే సాధ్యం. మనం పుడుతూనే ఆయన దగ్గరనుండి అపరిమితమైన శక్తులతో నిండిన భాండాగారాన్ని తెచ్చుకున్నాము. మన శరీరం అంతా దేవతల నివాసం. కళ్లు సూర్యచంద్రులు, నాలుక మీద సరస్వతి, హృదయంలో బ్రహ్మ, నాభి స్థానంలో శంకరుడు, మస్తిష్కంలో విఘ్నాధిపతి వినాయకుడు వున్నారు. ఇంతమంది దేవతలకు నిలయమైన మానవ శరీరము చాలా పవిత్రమైనది.

ఇంత పవిత్రమైన ఈ శరీరము ద్వారా ఏ లాభము, ఫలితము పొందగలమో దాన్ని పొందలేక పోతున్నాము. మన శరీరమే భగవదాలయమనీ తెలుసుకోలేక, మనసు కోరే కోరికల చిట్టాను దేవుడి విగ్రహం ముందు పెట్టి ఆయన ఆశీర్వాదం కోసం ప్రార్థిస్తాము. సర్వేస్వరుడు మనకు జ్ఞానం పంచుదామనుకుంటే, అజ్ఞానంతో సుఖాలను కోరుకుంటున్నాము. అవి పొందగానే శాంతి లభిస్తుందనకుంటాము. వాటిని పొందడం కోసం పూజలు వ్రతాలు ఆచరిస్తాము. నిజానికి భగవంతుడనుగ్రహించి, ఈ కోరికలు సఫలీకృతం చేసినా, సుఖమూ, శాంతి లభిస్తాయనుకోవడం భ్రమే!

రావణాసురుడు గొప్ప విద్వాంసుడు, సంపన్నుడు, అపారమైన శక్తి సంపాదించుకున్నాడు. పంచభూతాలను తన అధీనంలో వుంచుకున్నాడు. పురుషార్ధాలకు కొదవలేదు. అయినా అతనికి శాంతి లేదు. ఎందువలన అంటే అతడు చెడు మార్గంలో పయనించాడు. పరస్త్రీ వ్యామోహంలో పడి తన తేజస్సు, బలము, బుద్ధి, సద్గుణాలు అన్నీ కోల్పోయాడు. సీతాదేవిని అపహరించేందుకు ఎన్నో కుట్రలు పన్నాడు. చివరకు భిక్షగాడిగా మారాడు. సీతాపహరణ తదనంతరం, అతనికి ఏనాడూ మనశ్శాంతి లేదు. అతడి సుఖ సౌకర్యాలు శాంతిని ఇవ్వలేక పోయాయి.

మనము ఏపని కొరకు జీవిస్తున్నామో, ఎంత ఉజ్వలమైన జీవితము గడిపేందుకు అవకాశముందో, దాన్ని పట్టించుకోకుండా ఐహిక సుఖాల కోసం ప్రాకులాడుతూ, మనలోనే ఉన్న భగవంతుని ఉనికిని గ్రహించలేక పోతున్నాము.

ఉదాహరణగా ఒక చిన్న కథ తెలుసుకుందాం! భగవంతుడు మానవులకు జ్ఞానమును పంచుదామని భూలోకానికి విచ్చేసాడు. ఆయన కనపడగానే, మనిషి అన్ని రకాల కోరికలు కోరి, అవి తీరితే, మొక్కులు చెల్లిస్తామని వెంటపడటం మొదలుపెట్టాడు. దేవుడు గాభరాపడి పర్వతాలమీదకు వెళ్ళి కూర్చున్నాడు. మనిషి అక్కడికీ వచ్చాడు. సముద్రంలోకి వెళితే అక్కడికీ వెంబడించాడు. చివరకు ఆయన ఎవరూ చేరలేని ఏకాంత ప్రదేశము కొరకు వెదుకుతుండగా, నారద మహార్షి కనుపించాడు. "ఏమిటి స్వామీ! ఎక్కడికో బయలుదేరినట్టున్నారూ?" అని ప్రశ్నించాడు. "ఏమి చెప్పను నారదా! నేను ఈ మనుషులకు, సుఖశాంతులతో కూడిన స్వర్గము, ఇంకా ముక్తి ప్రసాదిద్దామని భూలోకానికి విచ్చేశాను. కానీ వీళ్ళు స్వార్థపరులై, కోరికలతో తప్ప జ్ఞానము కొరకు నాదగ్గరకు రావడంలేదు. అందుకే వీరికి దూరంగా, ఏకాంత ప్రదేశము కొరకు వెతుకుతున్నాను. కానీ వీరి మధ్యనే వీరితో సంబంధం కలిగి వుంటూ, ఎవరికీ కనిపించకుండా వుండాలనుకుంటున్నాను. అటువంటి ప్రదేశం కోసం వెతుకుతున్నాను. అటువంటి స్థలమేదైనా వుంటే నాకు చెప్పు" అన్నాడు.

అందుకు నారదుడు, "మీ ఆలోచన చాలా బాగుంది. నేను మీకు ఇప్పుడే ఒక విశాలమైన ప్రదేశం చూపిస్తాను. అక్కడ మీరు అందరి మధ్యలో వుండవచ్చు. అయినా, ప్రశాంతంగా వుండవచ్చు. నిజంగా మిమ్మల్ని కావాలనుకునేవారు మీ దగ్గరకి చేరుకోవచ్చు. సామాన్య మానవులు అటూ, ఇటూ తిరుగుతూ వుంటారు కానీ, మిమ్మల్ని చేరుకోవడం కష్టం. అంటూ ఆ ప్రదేశాన్ని చూపించాడు.

ఆ ప్రదేశం ఎక్కడుందో మీకు ఇప్పటికే తెలిసిందనుకుంటాను. ఆ ప్రదేశం మన హృదయ స్థానమే. మన హృదయంలో ఉన్న భగవంతుడిని గుర్తించక ఎక్కడోవున్నాడని, కనిపించడంలేదని, కనికరించడంలేదని అజ్ఞానంతో వాపోతూ వుంటాము. కానీ మనలోనే ఉన్న పరమాత్మను జ్ఞాన చక్షువులద్వారా దర్శించి తరించటంలోనే సుఖము, శాంతి లభిస్తాయి.

# మౌనం మాటలకంటే పదును

మాటలకంటే మౌనం ఎక్కువ భావ ప్రకటన చేయగలదు. ఎదుటివారి మౌనం మనల్ని మనం శోధించుకునేట్టు చేస్తుంది. "ముని మౌన పరాభవేత్" అన్నారు. అంటే ముని ప్రతిష్టకు అతని మౌనమే కారణం. అందుకే మునిలో అపారంగా జీవశక్తి వుంటుంది. తాపసులు, ఋషులు, పండితులు మౌన సాధన ద్వారా నిర్మలంగా ప్రకాశవంతంగా ఉంటారు.

మహాభారతంలోని చివరిశ్లోకం రాయగానే అప్పటిదాకా నిర్విరామంగా కదలిన గణపతి చేతిలోని ఘంటం విశ్రాంతి తీసుకుంది. వ్యాస మహర్షి గణపతిని చిరునవ్వుతో చూచి స్వామీ! నేను శ్లోకాలు చెబుతూనే ఉన్నాను. మీరు రాస్తూనే ఉన్నారు. మధ్యలో ఒక్కసారి కూడా మీరు నోరు మెదపలేదు. దీనిలోని ఆంతర్యం ఏమిటో? అన్నారు. వినాయకుడు మందహాసం చేస్తూ మౌనంగా ఉండటం వల్లే ఇంత పెద్ద గ్రంథం వ్రాయగలిగాను "అని వ్యాసమహర్షికి వివరించారు. మౌనమంటే మన దృష్టిలో మాట్లాడకుండా వుండటమే. కాని మనసులో రకరకాల ఆలోచనలతో సతమతమౌతు మౌన వ్రతం పట్టాము కాబట్టి సౌజ్ఞల ద్వారా అభివ్యక్తీకరిస్తూ, ఎదుటి వారికి అర్థం కాకపోతే తలకొట్టుకుంటూ, రాసి చూపిస్తూ పాటించే మౌనం సత్ఫలితాలను ఇవ్వలేదు. మనసులోని ఆలోచనలకు అడ్డు కట్టవేసి నిర్వికారంగా, నిర్విచారంగా, ప్రశాంతంగా, శూన్యమైన ధ్యానావస్థే మౌనం. ఈ విధంగా బాహ్యమౌనం, అంతర్మౌన సంయమనమే మౌన సాధనం.

ఈ మౌన సాధనకు మూడు స్థితులుంటాయి. మొదటిది నిర్విచార స్థితి. ఇందాక మనం చెప్పుకున్నట్లుగా మనం బాహ్యంగా మాట్లడకుండా వున్నా మనసు మాట్లాడుతుంటే మనలో మనం మాట్లడుకోవడం అవుతుంది. కాబట్టి మనసును ఆలోచన శూన్యంగా నిర్విచార స్థితిలో ఉంచాలి.

రెండో స్థితి నిర్వికార స్థితి ఎప్పుడైతే మనసును ఆలోచనా శూన్యంగా పెట్టామో, రాగద్వేషాలకు అతీతంగా ఉండి నిర్వికార స్థితికి చేరుకుంటాము.

ఇక మూడవ స్థితి నిష్కామత్వం. మనలో బాహ్యంగా అంతర్గతంగా ఉన్న కోరికలను తీర్చుకునే విధానంలో మంచి చెడుల మధ్య మనము ఊగిసలాడుతుంటాము. కాబట్టి మనసును కామరహితంగా నిష్కామంవైపు మళ్ళించ గలిగే సాధనమే మౌనం.

ప్రశాంతత కోసం గుళ్ళు గోపురాలు సందర్శిస్తూ వుంటాము. కాని చెంచలమైన మన మనసు మనతోటే వస్తుంది. ఏవిషయం నుంచి మనం మరుపు కోరుకుంటామో దాన్ని తనతో మోసుకొచ్చి పదే పదే గుర్తు చేస్తూ శాంతిలేకుండా చేస్తుంది.

శాంతినిచ్చే దివ్య ఔషధం ఆత్మ ఒక్కటే. ఆత్మదర్శనం కోసం సాధన చేసే వారికి శాంతి లభిస్తుంది. ఈ మౌన సాధన వల్ల చాలా లాభాలున్నాయి.

1. పనిభారం ఎక్కువై అలిసిపోయినప్పుడు మౌనంగా కొన్ని క్షణాలు గడిపితే మెదడుకు విశ్రాంతి చిక్కి కొన్ని గంటలు తిరిగి పనిచేయ గలిగే శక్తి లభిస్తుంది.
2. మౌనం వల్ల ఏకాగ్రత పెరుగుతుంది.
3. మౌనం వల్ల నిర్ధిష్టమైన ఆలోచనాశక్తి కలుగుతుంది.
4. మౌనం వల్ల సమస్యలను పరిష్కరించుకోగల సామర్థ్యం పెరుగుతుంది.
5. మౌనం వలన శతృత్వాన్ని అరికట్ట గలుగుతాము.
6. మౌనం పాటించటం వలన నూతన చైతన్యం, జీవన శక్తి లభిస్తుంది.
7. మౌనం వలన సూక్ష్మ పరిశీలన, ఆత్మవిమర్శ అలవడతాయి.
8. నిర్విచార, నిర్వికార, నిష్కామ, మౌనం పాటించటం వలన భగవంతుడి సందేశం మనం వినగలుగుతాము. ఆత్మను పరమాత్మతో అనుసంధానం చేసి అలౌకికమైన ఆనందం సొంతం చేసుకోగలుగు తాము. కాబట్టి మనం కనీసం వారానికొక్కరోజైనా త్రికరణ శుద్ధిగా మౌనం పాటించి మన అంతఃకరణాన్ని శుద్ధిగా, శుచిగా పవిత్రంగా వుంచుకొని ఇంటా బయట పడుతున్న టెన్షన్లను అధికమించే శక్తిని ఒనగూర్చుకుందాము.

# సత్వర బ్రహ్మజ్ఞానం

మనందరం సంసార సాగరంలో ఈదులాడుతున్నా, అంతిమ లక్ష్యం మోక్షసాధనవైపే వుంటుంది. అయితే దాన్ని భక్తి, జ్ఞాన, వైరాగ్యాల ద్వారా స్వయంగా సంపాదించుకోవాలే కానీ ఎవరో చెప్తేనో, దానం చెస్తేనో వచ్చేదికాదు. బాబాలు, యోగులు, ఆ మోక్షసాధన దిశగా మనకు దారి దీపాలుగా సహాయపడగలరు. అంతేకానీ, మోక్షాన్ని ఏదో తాయిలంలాగా, చేతిలో పెడతారనుకోవడం, దాన్ని తీసుకుని సత్వర బ్రహ్మజ్ఞానాన్ని పొందవచ్చనీ అనుకుంటే అంతకు మించిన అజ్ఞానం మరొకటుండదు.

శ్రీసాయిబాబా దగ్గరకు ఒక ధనవంతుడు వచ్చి తనకు సత్వరమే బ్రహ్మజ్ఞానాన్ని బోధిస్తే, తిరుగుటపాలో యింటికి వెళ్ళిపోతానని, రానూపోనూ టాంగా మాట్లాడుకుని వచ్చానని వేడుకున్నాడు. అందుకు బాబా సంతసించి నా దగ్గరకు "అందరూ కోరికతో వచ్చేవారేగానీ, నీలా బ్రహ్మజ్ఞానాన్ని అడిగినవాళ్లులేరు. ఇన్నాళ్లకు నువ్వువచ్చావు. చాలా సంతోషం" కూర్చోమని చెప్పి, అక్కడే వున్న కుర్రవాడిని పిలిచి "మర్వాడీ దగ్గరకెళ్లి 5 రూపాయలు అప్పుగా తీసుకురమ్మని పంపారు. కుర్రవాడు వెనక్కి వచ్చి మార్వాడీ ఇవ్వనన్నాడని చెప్పాడు. అయితే బాలా ఇంటికి వెళ్లి అడిగి రమ్మని పంపారు. కుర్రవాడు బాలా కూడా ఇవ్వనన్నాడని చెప్పాడు. ఇలా బాబా ఆ కుర్రవాడని పది మంది దగ్గరకు పంపినా, ఎవరూ ఇవ్వలేదు.

ఆ ధనవంతుడు ఇదంతా చూస్తూ కూడా జేబులోంచి అయిదు రూపాయలు తీసి ఇవ్వకపోగా, తనకు ఆలస్యమవుతోందనీ, తనకు బ్రహ్మజ్ఞానాన్ని చెప్పి తనువాత పనిచూచుకోమనీ, బాబాను తొందర చేసాడు. ఇంతలో బాబా భక్తుడూ, ప్రభుత్వ వుద్యోగీ అయిన ఒక వ్యక్తి రావడం జరిగింది. శ్రీ సాయిబాబా అతని చేత చీటీ రాయించి పంపగానే, మర్వాడీ ఠక్కున 5 రూపాయలు పంపడం జరిగింది.

అప్పుడు బాబా ఆ ధనవంతుడిని చూసి "ఎందుకుతొందర పడతావు? నీకు బ్రహ్మము చూపించడానికే ఈ తంతు నడుపుతున్నాను. ఏ అయిదు రూపాయలు కోసం నేనాకుర్రవాడిని ఊరంతా తిప్పానో, ఆ అయిదు

రూపాయల పరబ్రహ్మం యాభయిరెట్లుగా నీ జేబులో నోట్ల రూపంలో వుంది. అని అనగానే అతడు కంగారు పడుతూ జేబులోని డబ్బుతీసి లెక్కపెట్టగా సరిగా బాబా చెప్పినట్లుగా వుంది. అప్పుడు శ్రీ సాయి బాబా "నీ కరెన్సీ నీ దగ్గరే భద్ర పరచుకో. నేను అప్పు అడిగితే ఎక్కడా 5 రూపాయలు దొరకలేదు. అదే ఈ ప్రభుత్వోద్యోగి చీటీ పంపగానే అప్పుదొరికింది. ఫకీరు కాబట్టి నాకు అప్పు దొరకలేదు. తీర్చగలడని ప్రభుత్వోద్యోగికి అప్పు దొరికింది. అయిదు రూపాయలు అప్పు ఇవ్వడానికే అర్హతలు చూచే ఈ లోకంలో, బ్రహ్మ జ్ఞానాన్ని నీకివ్వడానికి నీ అర్హతను పరీక్షించాలి కదా! ఆత్మజ్ఞానం అందరికీ అలవడదు. దానికి కొన్ని అర్హతలు వుండాలి. ఎవరి మనసయితే, ధనదారా పుత్రేషణత్రయంలో తగులుకొని వుంటుందో వారికి ఆత్మవిద్యా, బ్రహ్మ జ్ఞానం దుర్లభం. ఇహపర విషయాలకూ, మర్యాదలకు, విరక్తి చెందిన వాడే పారమార్థిక రంగప్రవేశానికి అర్హుడు.

బ్రహ్మజ్ఞానం స్వశక్తితో లభించదు. గురువు ద్వారానే అది లభించగలదు. ఆపై భగవత్కటాక్షం కావాలి. చిరంజీవిగా బ్రతికుండాలనే కోరికా, ఇంద్రియలాలసతా, మనోవాంఛలు, బుద్ధిచోదితాలూ, అహంకారం-అనే ఈ అయిందిటినీ విసర్జించకుండా ఆ పరబ్రహ్మను చూడటం అసాధ్యం. ఎవరికేది కావాలో వారికి దానిని ఇవ్వగలను. కానీ, ఇచ్చే ముందు వాళ్లందుకు పాత్రులో కాదో పరీక్షిస్తాను. నేను చెప్పినది గ్రహించి పాటిస్తే నీకు మేలు జరుగుతుంది," అని బాబా ధనవంతుడికి హితబోధ చేశారు.

అంతటితో ఆ శ్రీమంతుడు తలతిరిగి, తన అనర్హతను తెలుసుకొని, బోధనా మాత్రం విని వెనుదిరిగాడు.

బాబా చేసిన ఈహితబోధ అందరికీ కనువిప్పు కలిగించే విధంగా తమ తమ అర్హతానర్హతలు బేరీజు వేసుకునే రీతిలోవుంది. ఎవరైతే జితేంద్రియులో, నిశ్చల మనస్కులో, వారు మాత్రమే జీవగమ్యమైన బ్రహ్మజ్ఞానాన్ని పొందగలుగుతారని తెలుసుకుని ఆ దిశగా పయనించ డానికి ప్రయత్నించాలి.

# అంతం-నిర్భయం

సర్వరోగాలకూ మందులను కనుగొని, ఆయువును పెంచగలిగిన మనిషి, మరణాన్ని నిరోధించలేక పోతున్నాడు. కంటికి కనిపించని ఎన్నో శక్తులను, వూహకందని మేధాశక్తిని మానవుడికి ప్రసాదించిన దైవం, మరణాన్ని జయించే శక్తిని మాత్రం ఇవ్వలేదు.

జీవితం నశ్వరమని తెలిసినా, దురాశ, మోహం ఇంకా ఇతర అరిషడ్వర్గాలను జయించలేక, ఎన్నెన్నో దుర్మార్గాలకు ఒడిగడుతున్నాడు మనిషి. ఇక మరణం తన చేతుల్లో వుంటే, ఇంకెన్ని ఘోరాలకు పాల్పడతాడో! అందుకేనేమో! అనంత శక్తియుక్తులనిచ్చి, మరణ శాశనం తన చేతిలో పెట్టుకున్నాడు ఆ దైవం.

పుట్టుక ముందు మనమేమిటో తెలియదు. చనిపోయిన తరువాత ఏమవుతామో తెలియదు. తెలిసిన జీవితాన్ని ఆనందమయంగా జీవించగలగాలి. బాల్యమంతా అజ్ఞానం, అమాయకత్వంలో గడిచి పోతుంది. బుద్ధి వికసిస్తున్న కొద్దీ, తెలివితేటలు, ప్రతిభాపాటావాలు, అందచందాలు మొదలైనవన్నీ, తనకు మాత్రమే సొంతమని అహంకరించడం మొదలుపెడతాడు.

తరతరాలు గుర్తుంచుకోగలిగిన గొప్ప శాస్త్రవేత్తలు, సంఘ సంస్కర్తలు, సంఘ సేవకులు చరిత్రలో మిగులుతారే తప్ప, ఫలానా పేరు గల మనిషి, రూపలావణ్యాలు కలిగిన మనిషి ఈ భూమి మీద కొంతకాలం జీవించా రనడానికి ఏ ఆధారాలూ మిగలవు. కాలప్రవాహంలో కొట్టుకు పోవల్సిందే! ఈ వాస్తవం గ్రహించ గలిగికూడా, ప్రతి నిమిషం తన ఉనికిని గుర్తించాలనే తాపత్రయంతోనే మూడొంతుల జీవితం గడిచిపోతుంది.

ప్రతి మనిషికి ఏదో ఒక రోజు తాను కూడా మరణిస్తానని తెలుసు. తన సన్నిహిత బంధుమిత్రుల మరణాలను, కర్మకాండలను చూసి విచారపడ తాడేకానీ, ఒక నాటికి తానుకూడా చనిపోతాననే ఆలోచన దగ్గరకు రానీయరు. దాన్నే శ్మాశాన వైరాగ్యం అంటారు. శ్మాశానంలో మనిషి కాలుతున్నప్పుడు మాత్రం ఎంతో వైరాగ్యం కలుగుతుంది. అదే కనుక మననం చేసుకుంటే, అల్పమైన కీర్తికోసం, అసత్యమైన పొగడ్తల కోసం పాకులాడటం వుండదు.

ఈ దేహం, దానితో వచ్చిన మమకారాలు, మరణంతో ముగిసి పోతాయంటే ప్రతి జీవికీ బాధగానే వుంటుంది. ఈ బాధనుంచి కొంత ఉపశమనం పొందటానికే పూజలు, వ్రతాలు, కర్మకాండలు మొదలైనవి ఉపయుక్తంగా వుంటాయి.

పుట్టిన ప్రతి ప్రాణీ గిట్టక తప్పదని తెలిసినా, మరణమనగానే, జీవించాలనే ఆసక్తి పెరుగుతుంది. మరణాన్ని నిర్భయంగా ఎదుర్కొనే వారు, స్వీకరించేవారు, ఆహ్వానించేవారు చాలా అరుదుగా ఉంటారు. అలాంటి అరుదైన వ్యక్తులలో శ్రీరమణ భగవాన్ ఒకరు.

ఒకనాడు రమణ భగవాన్ దగ్గరకు ఒకతను వచ్చి "గాడ్సే" "గాంధీ"ని చంపి వినుతికెక్కాడు నేను నిన్ను చంపి కీర్తినొందుతాను అంటూ బెదిరించాడుట.

"చంపునాయనా? నాకీ దేహభారం తప్పిపోతుంది" అన్నారట భగవాన్.

తరువాతి కాలంలో ఆవ్యక్తిని ఆత్మీయంగా చూసుకుంటూ అన్నపానాదులు సరిగ్గా అందాయోలేదో కనుక్కునేవారట.

అలా మరణాన్ని నిర్భయంగా ఆహ్వానించిన వారు శ్రీ రమణ మహర్షి.

అలాగే తన తల్లి నిర్యాణ సమయంలో, ఆమె ప్రాణం పోతున్నంతసేపూ, ఆమెగుండెపైన ఒక చెయ్యి, తలమీద ఒక చెయ్యివేసి, తన శక్తిని ఆవిడలో ప్రవేశింపచేసి, మోక్షప్రాప్తి కలిగించారట. తదనంతరం, ఇక ఆ శరీరంతో తనకి ఏమీ సంబంధం లేనట్టు లేచి వెళ్ళిపోయారట.

అంతటి నిర్వికార నిరామయ జీవి భగవాన్ రమణ మహర్షి.

మరణం గురించి భయపడటంకన్నా, దాన్ని అంగీకరించగలితే, ఇక ప్రపంచంలో మనల్ని బాధించే విషయాలేమీ ఉండవు. ఒక్కొక్కసారి మన నీడను చూసి మనమే భయపడుతుంటాము. అటువంటప్పుడు, మృత్యువు ముందు ఈ భయమెంత అని అనుకుంటే, ఇక ఏదీ మనల్ని భయపెట్టలేదు.

మనం పుట్టినప్పటి నుంచీ పయనిస్తున్నది మరణంవైపే అన్న స్పృహ కలిగి, ఆ పయనాన్ని ఆత్మీయతతో, ఆనందంగా, లోకోపకార బుద్ధితో ప్రశాంత చిత్తంతో, ఆహ్లాదంగా చేసుకోవడం మాత్రం మన చేతుల్లో వుంది. అలా జీవితాన్ని స్వర్గతుల్యం చేసుకుంటే, మరణాన్ని కూడా ఆనందంగా ఆహ్వానించ గలుగుతాము.

# సాయి శరణం

సాయీ శరణం- బాబా శరణం
అంటూ ఆర్తితో శరణు వేడగనే
ప్రేమదృక్కులను మాపై ప్రసరించేవు
సత్వరమే స్వాంతన చేకూర్చేవు
హే సచ్చిదానందా

మీ దివ్య వీక్షణమాత్రంచే
అసంకల్పిత ఆత్మసోధన కావించేము
మాతప్పొప్పుల పట్టిక మీకు నివేదించేము
నిశ్చింత మనస్కులై మరలి వెళ్లేము
హే సద్గురు

మాగ్రహాలన్నీ ప్రతికూలంగా ఉన్నా
సర్వస్య శరణాగతి అనగానే
వాటిని అనుగ్రహాలుగా మార్చేవు
నీ కరుణమాపై కురిపించేవు
హే సాయినాథ

కోరికలతో నీ దరి చేరేము
కామితములిచ్చి దీవించేవు
ఇంద్రియశక్తిని సడలించి
అతీంద్రియ శక్తిపై గురికలిగించేవు
హే భగవాన్

పురాకృత కర్మలనుండి విముక్తులను చేసేవు
భావి ప్రమాదాల హెచ్చరిక కావించేవు
భవసాగరమీదే శక్తిని ప్రసాదించేవు
ప్రాప్తా ప్రాప్తముల నెంచి బ్రహ్మజ్ఞానం భోధించేవు
హే సాయి మహారాజా!



చెట్లనిండా
పూలు
కొన్ని మాత్రమే
దేవుని పాదాల చెంత

అర్హత
దైవేచ్ఛ!